# బొమ్మలు చెప్పిన భజగోవిందం

## (నాటకం)

✶ *ఈ నాటకం 2009వ సంవత్సర నంది బహుమతి పోటీల్లో ప్రథమ ఉత్తమ ప్రదర్శనగా నిల్చి, స్వర్ణ నందిని కైవసం చేసుకున్నది. ప్రథమ ఉత్తమ ప్రదర్శనతో పాటుగా, ఉత్తమ రచయిత, ఉత్తమ విలన్, ఉత్తమ రంగాలంకరణ విభాగాల్లో నంది బహుమతులను పొందిన నాటకమిది.*

# బొమ్మలు చెప్పిన భజగోవిందం

(నాటకం)

## పాత్రలు

1. కేతిగాడు
2. బంగారక్క
3. మంత్రి శివశంకరం
4. గాయత్రీదేవి.
5. సెక్రటరీ
6. రాజు
7. పండితుడు
8. అధికారి
9. గణకుడు
10. విష్ణుమూర్తి
11. లక్ష్మీదేవి
12. పి.ఎ. వేణు

# బొమ్మలు చెప్పిన భజగోవిందం

## (నాటకం)

(తెర తొలిగింది. కేతిగాడు ప్రవేశించాడు)

**కేతి** : బంగారక్క! ఓ బంగారక్కా! ఏం చేస్తున్నావే?

**బంగా** : (లో నుండే) వంట పాత్రలు తోముతున్నాను.

**కేతి** : ఇప్పుడు నువు తోమాల్సింది ఆ పాత్రల్ని కాదు. ఇదిగో ఇక్కడున్న పాత్రల్ని.

**బంగా** : (ప్రవేశిస్తూ) అక్కడ పాత్రల్ని తోమడమేమిటయ్యా?

**కేతి** : అవును! ఆధ్యాత్మిక భావ జలధారల్ని మురుకుపట్టిన ఈ మనుష్యుల మీద చిలకరించి తోమితే తప్పా, ఈ సృష్టిలో మనిషి పాత్ర ఆవగింజంతని అర్థంకాదు. మనిషిని పతనం చెయ్యడంలో ధనం పాత్రేమిటో బోధపడదు. ఆ ధనార్జన కోసం మనిషి ఎన్నెన్ని దుష్ట పాత్రల్ని ధరిస్తున్నాడో తెలిసిరాదు.

**బంగా** : ఏంటీ ఇదంతా నీ పాండిత్యమే.

**కేతి** : ఇది నా పాండిత్యం కాదు – ఆది శంకరులది

**బంగా** : ఆది శంకరులదా! చాల్లే! అది వింటే నీరసం వస్తుంది.

**కేతి** : నీరసం రావడంమేంటీ – బుద్ధి లేకుండా మాట్లాడుతున్నావు. అతని వేదాంతాన్ని వింటే మనసంతా ఆనందంతో నిండిపోతుంది.

**బంగా** : కడుపు మాత్రం ఆకలితో మండిపోతుంది.

**కేతి** : ఆయనన్నట్టు అహాన్ని సోహంతో కలిపితే అనుక్షణం ఆత్మానందంలో మునిగిపోవచ్చు.

**బంగా** : ఆత్మ, పరమాత్మా – రెండూ నేనేనని శుష్క వేదాంతంలో తేలవచ్చు.

**కేతి** : జీవితం క్షణభంగురం. ఈ క్షణ కాలం కోసం ఈ ఆరాటాలూ, పోరాటాలు అవసరం లేదంటాడు, భ్రమాజనితమైన ఈ ప్రపంచం శాశ్వతం కాదంటాడు.

**బంగా** : ఏమయ్యా! ఒక్క మాట విను. ఎంత గొప్ప వేదాంతమైనా సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేసినప్పుడే అది సిద్ధాంతమౌతుంది. లేకపోతే కేవలం ఓ రాద్ధాంతంగా మిగిలిపోతుంది.

**కేతి** : అంటే నీ ఉద్దేశ్యం ఏంటీ? శంకరులు చెప్పినవి సమకాలీన సమాజానికి వర్తించవంటావా?

**బంగా** : నువ్వనేదేంటి? ఆయన చెప్పినవి ఈనాటి పరిస్థితులకు వర్తిస్తాయంటావా?

**కేతి** : అవును

**బంగా** : ఏది వర్తిస్తుందో ఎలావర్తిస్తుందో చెప్పు!

**కేతి** : చెబుతాను. ఎప్పుడూ నిశ్శబ్ధంగా వుండే ఆకాశం అప్పుడప్పుడు ఉరుములై గర్జిస్తుంది. నిత్యం తనలో తానే నిభాయించుకొనే సముద్రం కోపం వస్తే ఉప్పెనగా ముంచెత్తుతుంది. అలాగే.... మూఢాచారాలతోను దుష్ట సాంప్రదాయాలతోను స్తబ్ధంగా, నిస్తేజంగా ఉండే హైందవ సమాజంలో ఆధ్యాత్మిక తత్త్వతరంగంగా, అద్వైత గర్జనగా శంకరుల వారొచ్చారు. ఆయన ఆత్మవిలాసం, మనీషాపంచకం, వివేక చూడామణి, భజగోవిందం లాంటి అద్భుతమైన గ్రంథాలు రచించారు. వాటిలో మకుటాయ మానమైన భజగోవిందంలో శంకరులు చెప్పిన ఆధ్యాత్మిక సారాన్ని మనం ఈనాడు ఈ నాటక రూపంలో ప్రేక్షకులకు అందించబోతున్నాం.

**బంగా** : ఏంటీ భజగోవిందాన్ని నాటకంగానా? దాంట్లో కథలేదూ, పాడూ లేదూ అదేమి నాటకమయ్యా?

**కేతి** : ఏమి నాటకమో చూస్తే నీకే అర్థమౌతుంది.

**బంగా** : ప్రతి శ్లోకంలోనూ "భజగోవిందం భజగోవిందం మూఢమతే" అన్నాడు. అంటే గోవిందుని భజించరా ఓ మూఢుడా అని మనిషిని పట్టుకుని తిట్టాడు.

**కేతి** : అది తిట్టుకాదు.

**బంగా** : అది తిట్టేరా మూర్ఖుడా!

**కేతి** : ఇదిగో నన్ను మూర్ఖుడా అనొద్దు.

**బంగా** : చూశావా! కేవలం నువ్వొక బొమ్మవు! మూర్ఖుడా అంటే నీకే అంత పొడుచుకొచ్చిందే... జ్ఞానవంతుడైన మనిషిని మూఢుడా అని అనడం సమంజసమా? పైగా శంకరుడు అద్వైత సిద్ధాంతకర్త – అంటే జీవుడు, దేవుడు ఒక్కడే అని చెప్పిన పెద్దమనిషి – జీవుడి నుండి దేవుడ్ని వేరు చేసి అతడ్ని భజగోవిందమని చెప్పడం ఎంత వరకు సరైందో నువ్వే ఆలోచించు.

**కేతి** : చూడూ! నీతో వాదన చేయడం నా వల్లకాదు కానీ ఒక్క మాట మాత్రం నిజం.

**బంగా :** ఏంటది?

**కేతి :** మనిషికి భగవన్నిష్టను; ఆత్మనిష్టను కలిగించే అనేక విషయాలపై శంకరులు ఉపదేశించారు. అవి అన్ని కాల మాన పరిస్థితుల్లో మానవులకు శిరోధార్యం. ఈ నాటకం చూస్తే నీకు తెలుస్తుంది. భజగోవిందం యొక్క విశిష్టత - గొప్పదనం ఏంటన్నది. ఎంత రసానుభూతిని పొంది ఆత్మానందం కలుగుతుందో!

**బంగా :** నువ్వన్నట్టు నిజంగా నాకు అంతటి ఆత్మానందమే కలిగితే అప్పుడు ఒప్పుకుంటాను భజగోవిందం చాలాగొప్పదని.

**కేతి :** ఒప్పుకోవడం కాదు - నాటకం పూర్తయ్యేసరికి మన భావాలతోపాటు స్వభావాలూ మారిపోతాయి.

**బంగా :** అదీ చూద్దాం. వెయ్యించు నాటకం. (మంత్రి గారి నివాసం - పి.ఎ. వేణు సెల్‌లో మాట్లాడుతున్నారు)

**వేణు :** ఆ నమస్కారం! ఎవరూ ఎం.ఎల్.ఎ. పి.ఎ. నా? నేను మినిష్టర్ పి.ఏ.ని. నమస్కారం. ఓర్నీ! నేను నీకు నమస్కారం పెట్టడంలేదయ్యా! నువు పెడితే నేను రిసీవ్ చేసుకుంటున్నా. ఏంటి సంగతులు? హైదరాబాద్ వచ్చావా? సాయంత్రం కలుద్దాంలే. ఆ! లక్డీకపూల్! ఓ.కె. కలిశాక చెబుదువులే. (కాల్ కట్ చేసాడు. వెంటనే మరో కాల్ వచ్చింది).... ఆ! సార్! నమస్తే సార్ (లోనకు చూసాడు). (ఆః! నమస్తేసార్) (లోనకు చూసాడు) ఆః! రడీ అయిపోయారు. వచ్చేయండి సార్! ఇంట్లోనే ఉంటున్నారు. (రెడ్ బటన్ ప్రెస్ చేసాడు. మళ్ళీ వెంటనే ఫోన్ వచ్చింది) హల్లో! ఏంటోచెప్పు. నిన్నీసారీ మా ఆఫీస్ మెట్లెక్కనివ్వను జాగ్రత్త! ఏంటి చెప్పేది! ఎన్నిసార్లు చెప్పాలి. (అప్పుడే గాయత్రిదేవి బయటకొచ్చింది. అయితే పి.ఏ. ఆమెను చూడలేదు గనక చెప్పుకుపోతున్నాడు). ఈసారి తేకపోతే ఒప్పుకోను. రాసుకో పెట్టుబడి కాల్స్ నాలుగు, మొక్కుబడి కాల్స్ పన్నెండు, చేతబడి కాల్స్ ఎనిమిది. సాయంత్రం కలువే.

**గాయత్రి :** ఏంటయ్యా! ఏదో వర్గీకరణ చేసి చెబుతున్నావ్.

**వేణు :** ఏమీ లేదమ్మా!

**గాయత్రి :** నేను విన్నాను. చెప్పు పర్వాలేదు.

**వేణు :** అదేనమ్మా! మాల, మాదిగల వర్గీకరణ పోరాటం నడుస్తోంది కదా! దాని గురించి చెబ్తున్నాను.

గాయత్రి : ఊс! (గుడ్లురిమి చూసింది)

వేణు : ఫోన్ కాల్స్ రక రకాలుగా ఉంటాయమ్మ

గాయత్రి : ఏంటవి?

వేణు : ఇప్పుడు కొన్ని ఫోన్ కాల్స్ ఉంటాయి. ఎలా అంటే, ఇదిగో ఈ కాంట్రాక్ట్ మావాడికొచ్చేటట్టు చేయండి, మన వాడికి లైసెన్సు ఇవ్వండి, ఇతను మా దగ్గరి బంధువు అక్కడకు ట్రాన్సఫర్ చేయండి, అని అడుగుతారు. అయ్యగారు ఇలాంటి ఫోన్ కాల్స్ చేస్తే మనకి.... వస్తాయి, కాబట్టి వీటిని పెట్టుబడి కాల్స్ అంటాం. మరి కొన్ని ఉంటాయి. అవెలా ఉంటాయంటే, ఒక ఎం.ఎల్.ఎ. వచ్చి అన్నా! ఆ ఎం.ఆర్.ఓ. పట్టాలన్నీ మొత్తం అపోజిషనోళ్ళకి ఇచ్చాడు. ఒక్క టి (కార్డు) మన వాళ్ళకి రాలేదు. మొత్తం క్యాన్సిల్ చేయించాలంటాడు. దాంతో అయ్యగారు హీటెక్కిపోయి, ఏం సరిగ్గా ఉద్యోగం చేసుకోవాలని లేదా? సాయంత్రం కల్లా మొత్తం క్యాన్సిల్ చేసి నాకు చెప్పు, చేతగాకపోతే లీవ్ పెట్టుకుపో అని కేకలేస్తారు. వీటిని చేతబడి కాల్స్ అంటాం. ఇక మొక్కుబడి కాల్స్. ఇవేటంటే, నియోజక వర్గం నుండి వస్తుంటారు కార్యకర్తలు. చోటామోటా నాయకులు. వీళ్ళలో కొంతమందికి ఇంట్లో పెళ్ళాం, దగ్గర కప్పు టీ కూడా పుట్టదు. ఇక్కడ మాత్రం ఓ రుబాబు చూపిస్తారు. ఓట్లేసి గెలిపించాం. ఓట్లేసి గెలిపించామని తెగ గెంతుతారు. వీళ్ళ కోసమని కంటి తుడుపుగా వాటికీ, వీటికీ ఫోన్స్ చేస్తుంటాం. వీటిని మొక్కుబడి కాల్స్ అంటాం. ఇదమ్మా వర్గీకరణ అంటే.

గాయత్రి : మీకెప్పుడు బుద్దొస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి. (లోనకెళ్ళబోతుంది)

వేణు : అమ్మా! కాస్సేపట్లో సెక్రటరీ గారొస్తామన్నారు.... సార్‌కి చెప్పండి.... నేను బయట ఉంటాను.

గాయత్రి : అలాగే (గాయత్రిలోనకు వెళ్ళింది. మరో వైపు నుండి మంత్రి వచ్చారు)

మంత్రి : (పి.ఏ.తో) ఏవైనా ఇంపార్టెంట్ కాల్స్ ఉన్నాయా?

వేణు : సెక్రటరీ గారొస్తామన్నారు, ఇంకేకాల్స్ లేవుసార్ (పి.ఏ. బయటకు వెళ్ళాడు)

మంత్రి : స్సరే బయట ఉండు.... గాయత్రీ! (బయటనుండి సెక్రటరీ వచ్చాడు)

సెక్ర : నమస్కారం సార్!

మంత్రి : నమస్కారం! రండి కూర్చోండి.

సెక్ర : సార్! నేను ఆ గవర్నమెంట్‌లోను చేశాను - ఈ గవర్నమెంటులోనూ చేస్తున్నాను. మరో గవర్నమెంటు -

మంత్రి : వచ్చినా చేస్తారు. ఎవరి బట్టలుతికినా చాకిరేవుబండ ఒకటేగా...

సెక్ర : అదీ నిజమేగానీ... మరో గవర్నమెంటు వచ్చేవరకుండను, ఇంకో సంవత్సరంలో రిటైరౌతున్నాను.

మంత్రి : ఓహో! నాక్కావాల్సిన వాడివే దొరికావన్న మాట.

సెక్ర : అదెలా సార్!

మంత్రి : అంటే మీ అధికార్లు ఉద్యోగం వచ్చిన కొత్తలో మహాస్ట్రిక్టుగా వుంటారు. ఓ నీతికి నిర్వచనం అన్నట్టు. సీనియారిటీ పెరిగే కొద్దీ సిన్సియారిటీ తగ్గుతూ వుంటుంది. ఇహ రిటైర్‌మెంట్ ముందనుకో ఒకటే కొట్టుడు... పంట చేలో పడ్డ పశువులాగ.....

సెక్ర : ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తదా సార్! నాయకుల్ది ఏదారైతే అధికార్లది అదేదారి.....

మంత్రి : అబ్బా. నాకే కొట్టావు దెబ్బ... తెలివైనవాడివి... ఏది ఏమైతేనేం ఇద్దరిదీ ఒకటేదారి... ఓ ఆర్నెల్లలో ఓ వందకోట్లు వచ్చే ప్లాన్ ఒకటి చెప్పు.

సెక్ర : నాకు ముగ్గురున్నారు.

మంత్రి : పిల్లలా?

సెక్ర : కాదు. పెళ్ళాలు.

మంత్రి : గట్టోడివే

సెక్ర : ఇప్పుడు పూర్తిగా మెత్తబడిపోయాను...

మంత్రి : ఇంతకీ ముగ్గుర్ని ఎలా లైన్లోపెట్టావు?

సెక్ర : నేను పెట్టలేదు... వాళ్ళే నన్ను లైన్లో పెట్టారు.

మంత్రి : ఎలా?

సెక్ర : ఇందాక మీరన్నట్టు నేను సబ్-కలెక్టర్‌గా ఉన్నప్పుడు చాలా స్ట్రిక్టుగా ఛండ శాసనుడిలా ఉండేవాడ్ని. ఆ సిన్సియారిటీ చూసి మొదటిది లవ్ చేసి మ్యారేజి చేసుకుంది. దానికి పాటలంటే ఇష్టం. ఆ పాటలు నేర్పడానికి ఓ సింగర్ మా ఇంటికొచ్చేది. మా ఆవిడ ఇంట్లోలేనప్పుడు నాముందు కూర్చొని రాగాలు తీసేది. ఈ సంగతి పనివాళ్ళ ద్వారా మా ఆవిడ వరకెళ్ళి దాన్ని మాన్పించేసింది.

**మంత్రి :** ఏ ఆడదైనా అంతే చేస్తుంది.

సెక్ర : కానీ నేను మగాడ్ని కదా! ఏమగాడైనా ఏం చేస్తాడో అది చేశాను.

**మంత్రి :** ఏం చేశావు...

సెక్ర : నేను వాళ్ళింటికెళ్ళడం మొదలు పెట్టాను.

**మంత్రి :** కమిట్ అయ్యావా?

సెక్ర : ఎగ్జాక్ట్లీ! మంచి సింగర్ని కూడా అయ్యాను.

**మంత్రి :** గజల్స్ బాగా పాడతావంటారు...... ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉందంటగా....

సెక్ర : అలాంటి ఫేనే పీక్కి చుట్టుకుంది – మూడో పెళ్ళాంగా....

**మంత్రి :** బాగుందయ్యా! ముగ్గురితో మహారాజులా దర్జాగా ఉన్నావు.

సెక్ర : ఏం దర్జా సార్! ముగ్గురూ కలిసి నన్ను పేకాడుతున్నారు. కుక్క ఎండిన ఎముక పట్టుకొని చప్పరిస్తూ ఏదో తినేస్తున్నాని భ్రమపడుతుంది చూడండి... పెళ్ళాలు కూడా అంతే సార్! (మంత్రిగారి భార్య గాయత్రి కాఫీ తీసుకొచ్చింది)

**గాయ :** నారీస్తనభర నాభీదేశం, దృష్ట్వా మాగామోహావేశం, ఏతన్మాం నవసాది వికారం మనసివి చిన్తయ వారం, వారం.

సెక్ర : అంటే ఏంటమ్మా!

**గాయ :** మగువ కుచములు బంగరు చెండ్లని మరిమరి మోహము చెందుకురా ఛీ యవి మాంసపు ముద్దలని తలచి అసహ్యము నొందుమురా?

సెక్ర : అదేంటమ్మా! మీరు తీసుకొచ్చారు.

**మంత్రి :** పనివాళ్ళ ప్రోబ్లమ్ – కొంతమంది శలవు – మరికొంత మంది ఈమె చెప్పే శ్లోకాలు వినలేక వెళ్ళిపోయారు.

**గాయ :** అదేంకాదండీ! పనివాళ్ళ నెవర్నీ ఆ గుమ్మం దాటి ఇవతలకు రానివ్వరు. వస్తే ఇంట్లో మూలుగుతున్న వాటి గురించి తెలిసిపోతుందట.

**మంత్రి :** ఆత్మీయులనుకున్న వారికి ఆమె స్వయంగా చేసి ఇస్తుంది.

సెక్ర : (కృతజ్ఞతగా చూశాడు) థాంక్యూ సార్! అమ్మా! మీరు కూడా ఇలా కూర్చోండి – ఓ ఇంపార్టెంటు issue చెబుతాను...

**గాయ** : మీరు మాట్లాడుతూ ఉండండి... నేను మళ్ళీ వస్తాను ఏవండీ! నిన్న మీకు చెప్పిన కథ సెక్రటరీగారిక్కూడా చెప్పండి.

**మంత్రి** : ఏ కథా? రాజు – పండితుడి కథేనా.

**గాయ** : అవునండీ! అది వింటే పాపం మనసుని పరంమీద లగ్నం చేస్తారు.

**మంత్రి** : ఆల్‌రడీ లగ్నమైపోయి ఉన్నాడు. మమ్మల్ని మాట్లాడుకోనివ్వు.

**గాయ** : ఉండండి షుగర్ తెస్తాను. (లోనకు వెళ్ళింది)

**మంత్రి** : ఈ చెప్పు ఏదో ఒకటి చేసి బాగా డబ్బు సంపాయించాలయ్య.

సెక్ర : తప్పకుండా! సార్! సంపాదనలో మనం తేనెటీగల్ని ఆదర్శంగా తీసుకోవాలి.

**గాయ** : (షుగర్ బోటెల్ తీసుకొస్తూ) భలే చెప్పారండీ! తేనెటీగలాగ రాత్రి పగలు కష్టపడాలికదండీ.

**మంత్రి** : అక్కడింత, ఇక్కడింత సేకరించి ఒకచోట దాచిపెట్టాలా? మనకు కావాల్సింది వేలుకాదయ్యా? కోట్లు.... కోట్లు.

సెక్ర : తొందరపడకండి, కోట్లు వచ్చేటట్టు చేస్తాగా.

**గాయ** : ధర్మ బద్ధంగా రావాలి.

**మంత్రి** : (భార్యవైపు చాలా సీరియస్‌గా చూసి) నువ్వు చెప్పు.

సెక్ర : తేనెటీగ పువ్వును పాడు చెయ్యదు. రేకుల్ని ఊడగొట్టదు. మకరందాన్ని గుట్టు చప్పుడు కాకుండా పీల్చేసి గమ్మునుంటుంది. మనం ఏది తిన్నా తిన్నట్టుగానీ, తింటున్నట్టుగానీ తెలియగూడదు సార్.

**గాయ** : చట్ట వ్యతిరేకంగా, అధర్మంగా ఒక్కపైసా ఇంటి కొచ్చినా అది నిలవదు. గుర్తుంచుకోండి.

**మంత్రి** : ఈ ధర్మ శాస్త్రాలు మాకూ తెల్సులెండి. డబ్బు లేకపోతే ఎందుకూ పనికిరాం. అయినా ఇదంతా నీకనవసరం.. నువ్వు లోనకెళ్ళు... నేను పిల్చినప్పుడు రా.. వెళ్లు. (సెక్రటరీ ముందు అలా ఈసడించుకొనేసర్కి అవమానకరంగా భావించి, బాధపడి, లోనకు వెళ్ళిపోయింది గాయత్రీ దేవి.)

సెక్ర : అయ్యో! మీరుకాస్త నెమ్మదిగా చెప్పి ఉండాల్సింది.

**మంత్రి** : మీకు తెలీదు లెండి ఆవిడ సంగతి. ప్రతి పక్షాలన్నీ ఏకమైపోయి మీదపడి విమర్శించినా తట్టుకోవచ్చు. పది పత్రికలు వ్యతిరేకంగా రాసినవి చదివి మర్చిపోగలం. అబ్బా! ఈవిడ మాటలెలా ఉంటాయోతెల్సా! ఎహ్ పోనీలే అని

వదిలెయ్యలేం. విని అమలు చెయ్యలేం. గుండెల్లో శూలాలు – ఉంచుకోలేం ఊడ బెరకలేం, మధ్య మధ్యలో సంస్కృత శ్లోకాలు.

సెక్ర : కూల్ డౌన్ సార్! కూల్ డౌన్ పరిస్థితి నాకర్థమైంది. ఇక అసలు విషయానికొద్దాం. సిటీకి చుట్టూ ఉన్న గ్రామాల్లోని భూములు గవర్నమెంటు తీసుకుంటుందని ఒక నోటిఫికేషన్ ఇస్తాం. గవర్నమెంటంటే ఎకరాకు ఐదు పది లక్షల కన్నా ఎక్కువ ఇవ్వం. దాంతో రైతులు భయపడిపోతారు. మన వాళ్ళు వెళ్తారు. గవర్నమెంటుకన్న ఎక్కువ రేటిస్తామంటాం. ఎక్కువస్తుందంటే ఆశ కదా! మనకు అమ్మేస్తారు. భూములన్నీ మన చేతికొచ్చాక నోటిఫికేషన్ విత్‌డ్రా చేస్తాం. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వాళ్ళకు ఆ ల్యాండ్ డెవలప్‌మెంట్‌కి ఇస్తాం... అర్థమైందాసార్!

**మంత్రి :** అర్థమైంది.

సెక్ర : ఒక సంవత్సరంలో కమ్ సే కమ్ ఓ వందకోట్లు సంపాదించవచ్చు.

**మంత్రి :** ఒకవేళ వాళ్ళు మనకు అమ్మకపోతే...!

సెక్ర : అప్పుడు నిజంగానే ఆ భూముల్ని అక్వయిర్ చేద్దాం.

**మంత్రి :** చేసి ఏమి చేస్తాం.

సెక్ర : మనవాళ్ళ చేత ఒక ఐ.టి. కంపెనీ float చేసి, ఆ కంపెనీకి ఆ భూమిని చీప్‌గా ఇచ్చేద్దాం.

**మంత్రి :** Wonderful idea! Go a head. (లో నుండి వచ్చింది గాయత్రీ దేవి)

**గాయ :** ఆ ఊళ్లోవున్న ప్రజల సంగతి, ఆ భూముల మీద ఆధారపడి బ్రతుకుతున్న రైతుల సంగతి....

**మంత్రి :** నిన్ను ఇక్కడకు రావద్దన్నాను

సెక్ర : మీరుండండి సార్! నే మాట్లాడుతాను అమ్మా! ఇది మీకు అర్థం అయ్యేటట్టు చెప్తానుండండి.

**గాయ :** ఏంచెప్తారండి. న్యాయం, ధర్మం ఏవక్కర్లేదు – ప్రజల్ని, ప్రభుత్వాన్ని దోసేద్దామని చెప్తారు.

సెక్ర : నేనొక సీనియర్ I.A.S. ఆఫీసర్‌నమ్మా.

**గాయ :** సిన్సియారిటీ లేని సీనియారిటీ ఎందుకండీ. తల్లి ఒడి నుండి బిడ్డను దూరం చేస్తే ఎంత పాపమో, రైతుని భూమి నుండి దూరం చేస్తే అంత పాపం.

జనంకంట నీరు ఒలికితే అంతకన్న పాపం ఇంకొకటుండదు గుర్తుంచుకోండి.

**మంత్రి :** ఏంటి శాపనార్థాలు పెడుతున్నావు. ఇదంతా ఎవరికోసం!

**గాయ :** నేనూ అదే అడుగుతున్నాను. ఇదంతా ఎవరికోసం?... ఎందుకోసం ఇంత పాపాన్ని నెత్తిన రుద్దుకోవాలి? మనకున్నది చాలదా?

**మంత్రి :** మనకున్నది మనకి సరిపోతుంది. కానీ రాజకీయానికి సరిపోదు. మళ్ళీ నేను M.L.A.గా పోటీ చెయ్యాలా వద్దా? చెయ్యడానికి ఎంత కావాలో తెల్సా! మినిమం ఓ ఐదు కోట్లు. కేవలం డబ్బుంటే సరిపోదు. వెనక మందీ మార్బలం... కార్యకర్తలు కావాలి. కార్యకర్తలంటే కేవలం జిందాబాద్‌లు కొట్టేవాళ్ళు కాదు. ఎవడినైనా నాలుగు తన్నడానికి, కాళ్ళు, చేతులు తీసెయ్యమంటే చిటికెలో చేసే వాళ్ళు ఆ కార్యకర్తల్లో ఉండాలి. నన్నెవడైనా విమర్శించి డామేజ్ చేసారనుకో, వెంటనే షాపులు మూయించి, బస్సులన్నీ ఆపించే బ్యాచ్ ఒకటుండాలి మంత్రి పదవికి ముప్పు వచ్చే సూచనలు కనిపించాయనుకో, వెంటనే ఒంటి మీద కిరసనాయిల్ పోసుకొని చచ్చిపోవడానికి తయారయ్యే గ్యాంగు ఉండాలి. కేడరు, కార్యకర్తలు లేకుండా రాజకీయానికి ఉత్సాహమెలా వస్తుంది.

**గాయ :** అవన్నీ ఇప్పుడూ ఉన్నయిగా.

**మంత్రి :** ఉన్నాయి కాబట్టే మంత్రి పదవి వెలగపెడుతున్నామ్.

**గాయ :** ఇంకెందుకు అత్యాశ.

**మంత్రి :** ఈ మంత్రి పదవితో ఆగిపోవాలనుకోవట్లేదు. ఇంకా, ఇంకా పైకి వెళ్ళాలనుకుంటున్నాను. ఈ రోజుల్లో రాజకీయాల్లో ఎదగాలంటే ఏంకావాలో తెల్సా? ఒక చేతిలో పేపరుండాలి. మరో చేతిలో చానెల్ ఉండాలి. ఆ రెండూ ఉంటే మనం ఎన్ని లుచ్ఛా పనులు చేసినా పది మందికి దర్జాగా నీతులు చెప్పొచ్చు. మనం వందల వందల ఎకరాలు ఆక్రమించేసి మనకు పడని వారు ఓ పది సెంట్లు భూమి కొనుక్కున్నా కబ్జా చేసాడని ఓ రోజంతా న్యూస్ బులిటెన్ ఇస్తాం. మన మీటింగ్‌లకి జనం రాకపోయినా లక్షలు లక్షలు వచ్చినట్టు చూపించగలం. అవతలి పార్టీ మీటింగ్‌లకి లక్షలకు లక్షల మంది వచ్చినా ఎవ్వడూ రాలేదని చెప్పగలం, చూపించగలం. నువ్వు చెబుతుంటావే విష్ణుమూర్తి చేతిలో ఎప్పుడూ శంఖు చక్రాలుంటాయని, అలాగే నేటి

రాజకీయ నాయకులకు ఒక చేతిలో పేపర్ మరో చేతిలో ఛానల్ ఉండి తీరాలి. లేకపోతే జీవితాంతం బురద కడుక్కోడానికే సరిపోతుంది.

**గాయ** : మీరెన్ని సాకులు చెప్పినా ప్రజలకు అన్యాయం చేస్తే మాత్రం ఒప్పుకోను, బాధ్యతగల పదవుల్లో ఉండి illegal గా ప్రవర్తించడానికి మీకు మనసెలా ఒప్పుతుంది?

సెక్ర : In this nothing is illegal, madam?

**గాయ** : Shut up! What sort of an I.A.S. officer you are? illegal అంటే చట్టవ్యతిరేకమనే కాదు. చట్టాన్ని అడ్డంపెట్టి చేసింది కూడా ఇల్లీగలే.

**మంత్రి** : ఏంటి తెగరెచ్చిపోతున్నావు.

**గాయ** : రెచ్చిపోవడం కాదు. మీ దుర్మార్గం ఆపకపోతే మీడియాను, ఛానెల్స్‌ను మొత్తాన్ని పిల్చి మీ కుట్రనంతా బయట పెడతా, జాగ్రత్త.

**మంత్రి** : ఇదిగో ఫోను పిలవ్వే. ఏదో ఆఫీసర్ పెళ్ళాం, మొగుడ్ని బెదిరించినట్టు బెదిరిస్తున్నావు. ఎవడి బెదిరింపులకు, అదిలింపులకు లొంగని, వంగని బ్రతుకే మాది. మమ్మల్నెవడేమీ చెయ్యలేడు.

**గాయ** : ప్రగల్భాలాపండి. ఎవ్వడికీ లొంగకపోతే మీడియా వాళ్ళు, కనబడిన వెంటనే భుజాల మీద ఎందుకు చేతులేసి వాళ్ళను కాకా పడుతుంటారు.

**మంత్రి** : చంపి పాతరేస్తాను దొంగముండ.

**గాయ** : (బీరువా తీసి, దాంట్లోంచి దస్తావేజుల కట్ట తీసింది) ఇదిగో పిల్లల పేర్న, చుట్టాల పేర్న, ఉన్న వాళ్ళ పేర్న, చచ్చిన వాళ్ళ పేర్న, పుట్టిన వాళ్ళ పేర్న, పుట్ట బోయేవాళ్ళ పేర్న, కుక్కల పేర్న, గాడిదల పేర్న కొన్న భూములు. ఈ భూములన్నీ ఏం చేస్తారు. ఇదిగోండి బీరువాలో మూలుగుతున్న బంగారం, కరిగించి పోతపోస్తే ఊరికో గాంధీ విగ్రహం పెట్టొచ్చు. ఇంకా ఏం తక్కువైందని ఇంత అన్యాయం. పుట్టగతులుండవు జాగ్రత్త! “అర్థమనర్థం భావయ నిత్యం, నాస్తి తతః సుఖ వేశః సత్యం”. ధనము ధనమని కలవరించెదవు నిత్యం – ధనం నీకు సుఖాన్నివ్వదు. ఇది సత్యం.

**మంత్రి** : ధనం మనిషిని నడిపే ఇంధనం – గాలి పోగేసుకొని బతకడానికి నేనేమీ గాలినా కొడుకుని కాను.

**గాయ** : రాజకీయమంటే ప్రజాసేవేగానీ దర్జా, దర్పం, హోదా, హంగూ కాదు. మీరు తేలిగ్గా తీసేస్తున్న ఆ గాలే మీకు అందకుండా పోతున్న క్షణంలో ఇవేవీ మిమ్మల్ని కాపాడలేవు. మీ నరాల వ్యవస్థ మీ మీద తిరుగుబాటు చేసినప్పుడు

మీ కేడరు, కార్యకర్తలు, మీ పొలిటికల్ వ్యవస్థ ఏదీ, ఏ ఒక్కటీ, ఏ ఒక్కరూ మీ ఒక్కనరంలో కూడా ప్రాణశక్తిని నింపలేదు. ప్రజా నాయకునికి ఉండాల్సింది భౌతిక శక్తికాదు ఆధ్యాత్మిక శక్తి. (లోనకు వెళ్ళి పోయింది.) (బయట నుండి సెల్ తీసుకొని పి.ఏ. వేణు వచ్చారు)

**వేణు** : సార్ ఫోను

**మంత్రి** : ఎవరు?

**వేణు** : నియోజకవర్గం నుండి

**మంత్రి** : నియోజక వర్గమే. ఎవరో కనుక్కో! చౌదరిగారా? రెడ్డిగారా? ఆదాంగాడా? కిష్టప్పగాడా? ఎవరో కనుక్కొని ఇవ్వు. (అంటూ సెక్రటరీ వంక చూసి)

**మంత్రి** : ఆఫీసులో చెప్పవయ్యా అంటే ఇంటి కొచ్చేస్తాను...ఇంటి కొస్తానన్నావు... చూసావుగా ఇంట్లోని ఇంపు.

**సెక్ర** : నాకేమి తెల్సు సార్? ఇంత కంపని. మా ఇంట్లో వాళ్ళు సంపాదించమని సాధిస్తారు. వద్దని వేధించరు.

**మంత్రి** : అందుకేనయ్యా! రెండో ఇల్లు అవసరం పడేది.

**సెక్ర** : సార్! ఇలా కూర్చోండి... కాస్త నిదానించండి.

**పి.ఏ.** : (సెల్ మూసి) సార్ మన కార్యకర్త కొత్తపేట గణేష్, మొక్కుబడి కాలే.

**మంత్రి** : చెప్పుదీసి కొడతాను. (తమాయించుకొని) ఏదిలా ఇవ్వు. (లేని చిరునవ్వు పులుముకొని) గణేష్ ఏంటి చెప్పు. ఆఫీసర్స్‌తో మీటింగులో ఉన్నా... నీ ఫోన్ అనేసరికి తీసుకున్నా. ఆఁ! ఆఁ! (చిరాకొస్తోంది. కానీ కనబడనివ్వట్లేదు) స్సరే చేస్తాను. నేనే స్వయంగా మాట్లాడి చెబ్తాను. చెబ్తానయ్యా... చెబ్తాను. నువు చెప్పింది నేనెప్పుడు చెయ్యలేదో చెప్పు. (సెల్ తిరిగి పి.ఏ.కిస్తూ) ఆర్.డి.ఓ.కి కలుపు. ఎలక్షన్లొస్తున్నాయి కదా! ప్రతివాడూ బెదిరించేవాడే. ఇప్పుడున్న డీలర్‌ని కేన్సిల్ చేసి వీడి పెళ్ళాం కిప్పించాలట....

**పి.ఏ.** : సార్ ఆర్.డి.ఓ. గారు.

**మంత్రి** : హలో! ఆ నమస్కారం! ఆ కొత్తపేట డీలర్ ఎలా ఉన్నాడు. ఉన్న వాళ్ళందరిలో వాడే బాగున్నాడా? స్సరే! మా కార్యకర్త గణేష్ ... తెల్సా! ఆఁ! ఆఁ! నాకన్నా ముందు నాకారెక్కి కూర్చుంటాడు. వాడే.... వాడే.... వాడి పెళ్ళాంకిమ్మని చెబ్తుంటాను. కానీ ఇవ్వొద్దు... వద్దొద్దు.... నేను చెబ్తుంటాను. కానీ నువు చెయ్యొద్దు. (సెల్ తిరిగిచ్చాడు). నువు బయట ఉండు. (పి.ఎ. వెళ్ళిపోయాడు)

సెక్ర : సార్ మొత్తం డీల్ నాకప్పగించేయండి. ఆర్నెళ్ళలో ఓ వంద కోట్లు మీ అకౌంట్‌లో ఉంటాయి.

మంత్రి : ఇంత డీల్ నువ్వెలా చేస్తావయ్యా!

సెక్ర : ఇదెంత పని సార్! చిటికెలో చేసెయ్యనూ.

మంత్రి : ఏంటి ఆఫీసర్‌వి అయ్యిండి కూడా.

సెక్ర : కాబట్టే ఈజీగా చెయ్యగల్ను. ఇప్పుడు ఆఫీసర్స్‌లో కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మరి కొంత మంది కాంట్రాక్టులు. మిగిలిన మరికొంత మంది రాజకీయం. ఉద్యోగం ఈ రోజుల్లో పార్ట్ టైం జాబ్. ప్రక్క వ్యాపారాలే full time occupation. అంచేత మొత్తం నాకప్పగించేయండి. ఆర్నెళ్ళలో పూర్తి చేసేస్తాను.

మంత్రి : అలాగే చేద్దాం.... (సెల్ మోగింది. దాన్ని ఆన్సర్ చెయ్యడానికి కాస్త ప్రక్కకు వచ్చాడు)...హలో... ఆ! బయల్దేరుతున్నాను. ప్రాణం తినొద్దు వస్తా. (అదే అదునుగా భావించి సెక్రటరీ ఇటు ప్రక్కకొచ్చి ఏదో నంబరుకు డయల్ చేసి తనూ మాట్లాడుతున్నాడు. ఫోను సంభాషణ ఇంటర్‌కట్స్‌లో వినిపిస్తున్నాయి.)

మంత్రి : లేటంటే ఎలా? ఇంట్లో నీతి చంద్రిక, సూక్తి ముక్తావళి వినాలిగా. ఈ రోజు రాలేను. రేపొస్తా.

సెక్ర : రేపటి వరకెందుకు? ఈ రోజే వస్తా.

మంత్రి : ప్లాను చాలా బాగుంది. అంతా అతనే చేసేస్తానన్నాడు.

సెక్ర : అంతా నాకే అప్పగిస్తానన్నాడు.

మంత్రి : నేనెందుకప్పగిస్తాను?

సెక్ర : మీ ముగ్గురి గురించి చెప్పేశాను.

మంత్రి : నీ గురించి అప్పుడే ఎవరికీ చెప్పలేను కొన్నాళ్ళు రహస్యంగానే ఉండనీ.

సెక్ర : ఒక బలహీనత ఉంటే భయం - మనకు పది ఉన్నాయి. బలహీనతల్ని బయటకు చెబితే అదే బలంగా మారుతుంది.

మంత్రి : నేనెందుకు నమ్ముతాను నేను పొలిటీషియన్‌ని... వాళ్ళేమి రాసుకున్నా నేను సంతకం పెడితేనే జి.ఓ. అయ్యేది.

సెక్ర : మనం అడ్డంగా రాసేశామనుకో, ఆ సంతకమెందుకూ పనికిరాదు.

**మంత్రి :** అంచేత మన చేతికి వచ్చాక మొత్తం మీ తమ్ముడికి అప్పగిద్దాం.... that is power of Democracy.

**సెక్ర :** నువ్వు అడ్వాన్సులు తీసేసుకో. ఆ డీల్ నువ్వే చేద్దువుగాని... that is strength of Bureaucracy.

**మంత్రి, సెక్ర :** (ఇద్దరూ నవ్వుకుంటూ వచ్చి, షేక్‌హ్యాండ్ ఇచ్చుకున్నారు.)

**మంత్రి :** మీరు మంచి మంచి ప్లాన్‌లు వెయ్యండి. దాన్ని అమలు చెయ్యించే బాధ్యత నాది.

**సెక్ర :** మీరిలా ధైర్యాన్నివ్వండి... మొత్తం ఆంధ్రలో సగం భూమి మన అండర్‌లోకి తెచ్చేస్తాను. నేను వెళ్ళొస్తాను సార్. (వెళ్ళాడు) (గాయత్రిదేవి వచ్చింది) (సెల్ మ్రోగింది)

**మంత్రి :** హలో! ఆ నాన్నా! (భార్యతో) అమెరికా నుండి అబ్బాయి. ఎలా ఉన్నావు? నా ప్రపోజల్ మీద ఏం నిర్ణయం తీసుకున్నావ్.

**గాయ :** ఏదిలా ఇవ్వండి. (చేతిలోని ఫోను తీసుకుంది)... ఒరే బాబూ! నాన్న చెప్పినట్టు ఇండియాకు వచ్చేసేయ్. కానీ పాలిటిక్స్‌లో మాత్రం జాయిన్ కావద్దు. (ఫోను లాక్కొని)

**మంత్రి :** ఇండియాకు రావడమంటూ జరిగితే పాలిటిక్స్‌లో జాయిన్ కావడానికే...

**గాయ :** ఏదిలా ఇవ్వండి... (ఫోనులో) ఒరేయ్! మనిషిగా జన్మించడానికి ఇండియాకు మించిన దేశం లేదురా.

**మంత్రి :** (లాక్కొని) నిజమే! ఇక్కడ డబ్బు పెడితే దొరకని వస్తువంటూ లేదు. ఆఖరికి ఓట్లూ, పదవులు కూడా కొనుక్కోవచ్చు.

**గాయ :** (తీసుకొని) అరేయ్! ఈ మాటలు నమ్మకు భారతదేశం గొప్ప సంస్కృతి నాగరికతలకు పుట్టినిల్లు. వాటిని అనుభవిస్తూ జీవించడమే మోక్షం.

**మంత్రి :** (లాక్కొని) డబ్బున్న వాడి అహంకారం అది లేని వాడి హాహాకారం రెండూ కలిపితే ఇండియా.

**గాయ :** (తీసుకొని) కాదు ఇండియా అంటే పవిత్రమైన ఓంకారం. సాటి మనిషిపై చూపే మమకారం ఇండియా అంటే.

**మంత్రి :** నీ సొద నాకెలాగూ తప్పదు – వాడి బుర్రెందుకు తింటావు. ఇలా ఇవ్వు (ఫోనులాక్కున్నాడు) ఒరేయ్ నాన్న! కోట్లున్నా ఎవడి వంట వాడు చేసుకొని

ఎవడు తిన్న ఎంగిలిగిన్నె వాడు కడుక్కొనే బతుకు అమెరికాలో. ఆ ఉద్యోగానికి రిజైన్ చేసేసి, ఇక్కడ కొచ్చేసెయ్. హాయిగా నిన్ను పొలిటికల్ లీడర్‌ని చేసేస్తాను. ఒకే నా.... బై.

**గాయ** : ఇదిగో మీకెలాగూ నా మాటలు లెక్కలేదు. నా కొడుకుని నాకు దూరం చెయ్యకండి.

**మంత్రి** : నేను దూరం చేసేదేంటి. నీ శ్లోకాలు వింటే వాడే దూరంగా పారిపోతాడు.

**గాయ** : (వాడిని రానివ్వండి. నా శిక్షణలో వాడినొక ఆదర్శమైన రాజకీయ నాయకునిగా తయారు చేస్తాను.) ఏంటీ ఇంతకూ ఆ భూముల్ని కైవల్యం చేసుకోవాలనే నిర్ణయించుకున్నారా!

**మంత్రి** : అవును.

**గాయ** : (అయితే ఆ పండితునికి పట్టిన గతే మీకూ పడుతుంది.) ఆ పండితుని కథలోని నీతి తెలిశాక కూడా

**మంత్రి** : కథలు వేరు, జీవితాలు వేరు, నీతులు వేరు, నిజాలు వేరు. వెళ్ళి పడుకో! నేను ఫైళ్ళు చూసుకోవాలి.

**గాయ** : రెండూ ఒక్కటే.

**మంత్రి** : కాదులే – వెళ్ళి పనిచూసుకో (గాయత్రీదేవి వెళ్ళింది) (మంత్రి, ఓ కార్నర్ సోఫాలో కూచుని ఫైల్స్ చూస్తున్నాడు... మెల్లిగా ఆవులించాడు. ఒళ్ళువిరుచుకుని మళ్ళీ ఫైల్స్ చూడబోయి అలసటగా సోఫాలో వెనక్కి వాలాడు....) Spot....on మంత్రి..... stage రెండు పార్టులుగా మారింది – (Area lighting effect) LF లో light... మంత్రి మీద Lights off... ఎడమ వైపు పండితుడు... రాజుగారు ఉన్నారు...)

**రాజు** : కవిరాజా! మీరు అమరాంధ్ర భాషల్లో ఉద్ధండులని విన్నాం... నేనొక సందర్భాన్ని చెబుతాను. దానిపై ఒక అద్భుతమైన శ్లోకాన్ని చెప్పండి.

**పండి** : చిత్తం ప్రభూ! సందర్భాన్ని వివరించండి.

**రాజు** : అర్జునుని కన్నా, ఆంజనేయుని కన్నా, ఆఖరకు పరమశివుని కన్నా, నేను గొప్పవాడినంటున్నాను. అది ఏ విధంగా గొప్పవాడినో సమర్థించండి.

**పండి** : చిత్తగించండి.

దగ్ధం ఖాండవ మర్జునేనా పృధా దివ్య ధృమైభూషితమ్
దగ్ధా వాయుసుతేన హేమ రచితా లంకాపురి స్వర్గభూః
దగ్ధ స్సర్వ సుఖాస్పదశ్చ మదనోహావృధా శంబునా
దారిద్ర్యం ఘనతాపదం భువి ఋణా కేనాపినో దహ్యతే

**రాజు** : అద్భుతం! మహాద్భుతం!

**పండి** : సంతోషమా మహరాజా.

**రాజు** : కాకుండా ఎలా ఉంటుంది కవిరాజా! ఖాండవ వనాన్ని అర్జునుడు దహనం చేసాడా? సువర్ణ మయమైన లంకానగరాన్ని ఆంజనేయుడు దహనం చేసాడు. సర్వసుఖా వాంఛలకు ప్రేరకుడైన మన్మధుణ్ణి పరమ శివుడు దహనం చేసాడు. కానీ దుర్భరమైన మీ పేదరికాన్ని ఎవరూ దహింపజేయలేకపోతున్నారా? ఆహా ఎంత చమత్కారం. ఇప్పుడు మీ పేదరికాన్ని పోగొట్టగలిగితే నేను ఆ ముగ్గురి కన్నా గొప్పవాన్ని అవుతాను. అంతే కదా కవి శ్రేష్టమా?

**పండి** : అవును ప్రభూ! పేదరికానికి మించిన శాపం లేదు. రాజదర్శనం మించిన వరమూ లేదు. నన్ను అనుగ్రహించి నా పేదరికాన్ని పారద్రోలండి ప్రభూ!

**రాజు** : మీ పాండిత్యానికి ఏమిచ్చినా తక్కువే... కోరుకోండి కవివర్యా! మీకేం కావాలి!... మణులా! మాణిక్యాలా!... ధన కనక వస్తు వాహనాదులా! కోరుకోండి...

**పండి** : (వినయంగా) నాకివేవీ అక్కర్లేదు ప్రభూ!

**రాజు** : (ఆశ్చర్యంగా) ఏమీ!... మీ మనోగతం మాకు అర్థంకావడం లేదు. నిజానికి మేమిస్తామంటున్న వేవీ మీ పాండిత్యానికి విలువ కట్టలేవన్న విషయం మాకూ తెలుసు... కానీ... మమ్మల్ని ఇంత సంతోష పరిచిన మీకు ఏదైనా ఇవ్వాలని మా మనసు ఉవ్విళ్ళూరుతున్నది... మీకేం కావాలో మీరే సెలవీయండి.

**పండి** : మరేమీ లేదు ప్రభూ....

**రాజు** : సందేహించకండి కవివరేణ్యా... మీకేం కావాలో నిర్భయంగా అడగండి. మీరేది కోరినా ఇవ్వడానికి మేము సిద్ధంగా వున్నాం.

**పండి** : తమరు అన్యధా భావించక నాకు... నాకు కొంత భూమిని ప్రసాదించండి ప్రభూ.

రాజు : (ఆశ్చర్యంగా) భూమి నా!

పండి : అవును ప్రభూ! నాకు చిరకాలంగా భూస్వామి అని పిలిపించుకోవాలని కోరిక ప్రభూ!

రాజు : సరస్వతీపుత్రులైన మీరు భూస్వాములుగా మారతాననడం వింతగా అనిపిస్తోంది.

పండి : ప్రభువుల వారికి నా మనవి వింతగానే అనిపించవచ్చు... కానీ!.... ఎన్నాళ్ళనుండో నా మనసులో గూడుకట్టుకుని వున్న కోరిక ప్రభూ!... మా ఊరిలో భూస్వాములను చూస్తూ వున్నప్పుడల్లా ఆ కోరిక పెరిగిపోతూనే వుంది. వారి దర్జా, దర్పం, హంగు, ఆర్భాటం... ఇవన్నీ చూస్తూంటే ఎప్పటికైనా నేను కూడా ఒక గొప్ప భూస్వామిని కావాలని గట్టిగా నిర్ణయించుకున్నాను, అదే నా జీవితాశయం.

రాజు : పండితోత్తమా! మీ ఆశను ఆశయాన్ని మేము కాదనటం లేదు. కానీ.... అందులోని ఉచితానుచితాలు గుర్తించమంటున్నాను.... సాక్షాత్తూ ఆ శారదాదేవి అనుగ్రహపాత్రులైన మీవంటి వారికి అటువంటి కోరిక శోభనివ్వదు సరికదా! సంతాపాన్నే మిగులుస్తుందని మా అభిప్రాయం.

పండి : పండితుడనైనంత మాత్రాన నేను భూస్వామిని కావాలని కోరుకోవడం కూడనిదా ప్రభూ!

రాజు : కూడనిదని కాదు... (ఏదో అనబోయి ... ఆగి) మీ ముచ్చట మేమెందుకు కాదనాలి... అడగండి మీకెంత భూమి కావాలి... పదెకరాలా... వందలెకరాలా... అడగండి మీరెంత అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా వున్నాము.

పండి : (స్వగతం) ఎంతని అడగాలి?... ఎంత అడిగితే బాగుంటుందో అర్థం కావడం లేదే!

రాజు : ఏమిటి యోచిస్తున్నారు!

పండి : అదే ప్రభూ! ఎంత భూమి అడగాలో అర్థం కావడం లేదు.

రాజు : (నవ్వి) మీరెంత అడిగినా మేము కాదనం... సంకోచించక మీ మనసులోన మాట సెలవీయండి.

పండి : (స్వగతం) ఎంతో కొంత అడిగితే?.... ఇంతేనా అంటారేమో! ఎక్కువ అడిగితే అత్యాశ అనుకుంటారేమో... ఎలా గబ్బా... ఆ ... ఇలా అడిగితే

బాగుంటుంది. మహా ప్రభూ నిజానికి ఎంత అడగాలో నాకే అర్థం కావడం లేదు... అందుకే తమరు అన్యదా భావించనంటే ఒక్క మనవి... రేపుదయం సూర్యోదయం వేళ నుంచీ సూర్యాస్తమయం వరకూ నేను నడిచి తిరుగాడిన నేల నంతయూ నాకిప్పించగలరు.

**రాజు** : (చిన్నగా నవ్వి) (చప్పట్లుచరిచి) ఎవరక్కడ!

**అధి** : (వచ్చి) చిత్తం ప్రభూ!

**రాజు** : రేపు సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకూ ఈ పండితోత్తముడు నడిచిన నేలను గణించి వీరికి ధారాదత్తం చేయండి.....

**అధి** : చిత్తం ప్రభూ!

**రాజు** : పండితోత్తమా! మీ మనోవాంఛ తీరినట్టేగదూ!

**పండి** : (వినయంగా నమస్కరించి) ఏలిన వారి దయకు సర్వదా కృతజ్ఞుడను.

(Lights Off - Lights On)

ఇప్పుడు లైట్‌లో పండితుడు నడుస్తున్నాడు – అధికారి, గణకుడు గుర్రాల మీద వస్తున్నారు.

**పండి** : (స్వగతం) అమ్మయ్య! ఇప్పటికి రెండు కోసుల దూరం నడవగలిగాను... (అధికారులతో) ఇదిగో బాబూ! సరిగ్గా లెక్కపెడుతున్నారా?

**అధి** : (గుర్రం మీద మెల్లగా వస్తున్నట్లుగా) కంగారు పడకండి కవిరాజా! మీరు మా దృష్టికి అందకుండా వెళ్ళిపోతే తప్ప మా లెక్కల్లో తప్పులు జరగవు....

**పండి** : నేనేమైనా చంద్రుడినటోయ్! పదిహేను రోజులు కనిపించి, పదిహేను రోజులు ముఖం చాటేయడానికి. (పండితుడు మళ్ళీ నడుస్తున్నాడు... అధికారులు వెంటవస్తున్నారు) (ఎదురుగా పచ్చని పైరు కనిపించింది)

**పండి** : ఆహా! ఎంత చక్కని పైరు... (అధికారులతో) బాబూ! ఆ కనిపించే పంటపొలాలు ఎవరివి?

**అధి** : ఎవరివైతే మీకెందుకు కవిరాజా! మీరు ఆ దిశగా నడిస్తే అవి మీ సొంతం అవుతాయి!

**పండి** : (స్వగతం) చక్కని అవకాశం! ఆ పంటపొలాన్ని దక్కించుకుంటాను... కట్నం చాలలేదన్న వంకతో నాకూతుర్ని కాపురానికే తీసుకెళ్ళలేదు నా అల్లుడు. ఈ

పంట పొలాన్ని కట్నం బాకీ కింద మా అల్లుడి మొహాన కొడతాను... నా కూతురు సంసారం బాగుపడుతుంది. (అంటూ పొలాల వంక నడక సాగించాడు) (మళ్ళీ కాసేపు నడక)

**అధి** : పండితోత్తమా! బాగా అలసినట్లున్నారు!... కాసింత విశ్రాంతి తీసుకుంటారా?

**పండి** : అమ్మో! విశ్రాంతా! వద్దు! వద్దు! విశ్రాంతి తీసుకొనే సమయంలో మరికాస్త భూమిని చుట్టిరావచ్చు. మన నడకను చూసి సూర్యుడే సిగ్గుపడాలి. ఈ పండితునిలా నేను నడిచి ఉంటే ఇంకెన్నో గ్రహాలు తన సౌరకుటుంబంలోకి వచ్చి చేరేవి కదా అని పశ్చాత్తాప పడాలి. (అంటూ మళ్ళీ నడుస్తున్నాడు) (పచ్చని తోటలు కనిపించాయి)

**పండి** : (నడుస్తూ) ఎంత రమణీయంగా వున్నాయా తోటలు... ఫలపుష్పాలతో నిండి కన్నులకు ఇంపుగా వున్నాయి... (అధికారులతో) ఆ దూరంగా కనిపించే తోటలు ఎవరివి?

**అధి** : (అటుచూసి) అవా?... ప్రయత్నం చేస్తే మీవే అవుతాయి.. (పైకి చూసి) సూర్యుడు నడినెత్తికి వచ్చాడు... ఎండ మాడ్చేస్తోంది కవిరాజా! కాస్త దప్పిక తీర్చుకుని బయలుదేరుదామా!

**పండి** : వద్దు వద్దు.... ఇప్పటికీ చాలా సమయం అయిపోయింది. పొద్దుగూకడానికి ఆట్టే సమయం లేదు... ఈలోగనే కనిపించిందంతా సొంతం చేసుకోవాలి! ఇలా దప్పిక తీర్చుకోడానికి, ఆకలి తీర్చుకోడానికీ ఆగుతూపోతే అనుకున్నది సాధించలేను. మీకో సంగతి తెల్సా! మీ మాటలు విని నా మనసిక్కడ ఆగిపోయిన నా కాళ్ళు మాత్రం.... నేననుకున్న గమ్యాన్ని చేరిపోతాయి. అదీ నా పట్టుదలంటే. (నడక కాస్త వేగంగా మారింది)

**పండి** : (వేగంగా నడుస్తూ ఆయాసంగా – స్వగతం) ఆ తోటను నా సొంతం చేసుకుంటాను – పనీ పాటా లేకుండా తిరుగుతున్న మా బావమరిదిగాడికి ఆ తోటరాసిస్తే వాడి బతుకేదో వాడు బతుకుతాడు – మా ఇంటావిడకూ నా మీద గౌరవం పెరుగుతుంది. అత్తవారింట్లో నా పరపతీ పెరుగుతుంది. (అలాగే – ఆయాసపడుతూ వేగంగా నడుస్తున్నాడు....) (ఇప్పుడు సెలయేర్లు, ఉద్యానవనాలు కనిపించాయి)

**పండి** : (స్వగతం) ఆహా! ఎంత ఆహ్లాదకరంగా వున్నదా ప్రదేశం.... దీన్ని కూడా నా సొంతం చేసుకోవాలి... ఆ మెరక వీధి రంగసానికి ఎంత పొగరు... మొన్న

నాతో ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడింది, నీ దగ్గర అక్షరాలు తప్ప లక్షలు లేవుగా అని ఈసడించింది.... ఈ ప్రదేశాన్ని దానికి రాసిచ్చేస్తే అపుడు దిగుతుంది దాని తలబిరుసు, ఇక జీవితాంతం నా కాళ్ళ దగ్గర బానిసేగా!... (అటుచూసి)... చూస్తూంటే చాలా దూరంలో వున్నట్లుందే... (పైకిచూసి) అమ్మో! పొద్దుగూకుతోంది... చేరుకోవాలి... సూర్యాస్తమయంలోగా దాన్ని కూడా సొంతం చేసుకోవాలి... (అంటూ వేగంగా నడిచాడు, పరుగు లంకించు కొని వేగంగా పరుగు తీయడం ప్రారంభించాడు)

**అధి** : పండితోత్తమా... కాసేపు విశ్రమిస్తే మంచిది... ఉదయం నుంచి అన్నపానీయాలు ముట్టకుండా ఏకధాటిగా నడుస్తున్నారు!

**పండి** : (పరుగుతీస్తూ - ఆయాసపడుతూ) వద్దని చెప్తే మీక్కాదూ!... ఓ పక్క సూర్యాస్తమయం అవబోతూంటే ఇపుడు విశ్రమించమంటారేం (పైకి చూసి) అమ్మో!..... వేళ మించిపోతోంది.... (అటుచూసి) అమ్మో! కీళ్ళు లాగేస్తున్నాయి... గుండెల్లో దడ... చేరగలనా... సమయం మించిపోయేలోగా ఆ ఉద్యానవనాన్ని చేరగలనా... చేరాలి... చేరి తీరాలి... చేరతాను... చేరతాను... (ఆయాసపడుతూ... పరుగు తీస్తూ తీస్తూ.. ఒక్కసారిగా కూలబడ్డాడు - విపరీతమైన ఆయాసంతో బాధతో మెలికలు తిరుగుతున్నాడు)

**అధి** : (దగ్గరికి వచ్చి) అయ్యో! అయ్యో! నీళ్ళు తాగండి! (త్రాగించారు) పండితోత్తమా - సూర్యాస్తమయం అవుతోంది. లేవండి... పరిగెత్తండి...ఆ భూమిని సొంతం చేసుకోండి.

**పండి** : ఆ! ఆ! (లేవబోయి పడిపోయాడు)

**అధి** : లేవండి! లేవకపోతే పరుగెత్తలేరు. లేచి పరుగెత్తండి.

**పండి** : పరిగెత్తడం కాదు. కనీసం లేవ... లేను.. కాళ్ళు చేతులు స్వాధీనంలోకి రావడంలేదు.

**అధి** : అలాగంటే ఎలా! మిమ్మల్ని చూసి సూర్యుడే సిగ్గుపడాలన్నారు. మీ మనసిక్కడ ఆగిపోయినా మీ కాళ్ళు అయినా గమ్యాన్ని చేరతాయన్నారు.

**పండి** : అవును చేరతాయి. అదిగో నా కాళ్ళు పరుగెడుతున్నాయి... నన్ను విడిచి నా కాళ్ళు పరుగెడుతున్నాయి.

అధి : నన్ను ఇక్కడ ఉండమంటారా? మీ కాళ్ళను వెంబడించమంటారా?

పండి : వెళ్ళండి.... నాకాళ్ళను వెంబడించండి....

అధి : పండితులు గారూ! మీరు ఇక్కడే ఉన్నారు. మీ కాళ్ళూ ఇక్కడే ఉన్నాయి.

పండి : ఏంటీ... నా కాళ్ళు ఇక్కడే... ఇక్కడే...

అధి : ఉన్నాయి....

పండి : అవునా?... (క్రిందకు చూసాడు చుట్టూ చూసాడు)

అధి : రాజు గారికి ఇంత వరకు లెక్క చెప్పమంటారా?

పండి : కాదు. ఈ విశ్వమంతా అని చెప్పండి.

అధి : ఇంకా మీకు బుద్ధి రాలేదు.

పండి : వచ్చింది నాయినా! లోకం కల్పించే మాయను కుటుంబం ఏర్పరిచే మోహాన్ని తెల్సుకొని బుద్ధి వచ్చింది. ప్రాణం దేహాన్ని వదిలి దైవ దర్శనం కోసం విశ్వం వాకిటిలో అడుగు పెడుతోంది... మరి కాస్సేపటిలో ఈ విశ్వమంతా నాది కాబోతోంది. సృష్టికౌగిట చేరి సేదదీరబోతున్నాను... ఈ శరీరం నిలుచున్నా కూర్చున్నా పడుకున్నా ఆరడగులకు మించి అక్కర్లేదు. ఆరడుగులు ఇప్పించమని రాజుగారికి చెప్పండి.

అధి : ఏంటి ఆరడుగు లేనా?

పండి : అవును ఆశ కున్నంత బలం ఆయుష్షుకుండదు నాయనా! (అచేతనుడయ్యాడు)

(Area - Lights Off)

(సోఫాలో వెనక్కు వాలి పడుకుని వున్న మినిష్టర్ ఒక్కసారిగా ఉలిక్కిపడిలేచాడు. అయోమయంగా చుట్టూ చూసాడు)

తల విదిలించి పైకి లేచాడు మినిష్టర్ గుండెల్లో నొప్పి మొదలైనట్లు గుండె పట్టుకుని బాధతో మెలికలు తిరిగాడు – నోరుతెరిచి భార్యను పిలవాలని ప్రయత్నిస్తున్నాడు – నోట్లోంచి మాట రావడం లేదు.

మంత్రి : గాయత్రీ! గాయత్రీ! (స్వగతం) ఇదేమిటి నాగొంతుకేమైంది... పిలవలేకపోతున్నానా! లేక పిలిచానని భ్రమపడుతున్నానా? (గొంతు పట్టుకుని బాధగా రెండడుగులు వేసి టేబుల్ మీదికి తూలాడు – నొప్పి మరింత ఎక్కువైంది. ఆసరా తీసుకుబోయేంతలో చేతికి భార్య వదిలిన నగలు

దొరికాయి – తీసుకుని గుండెకు హత్తుకున్నాడు – అయినా బాధ తగ్గడం లేదు – ఆయాసం, రొప్పు మొదలయ్యాయి)

**మంత్రి :** (స్వగతం) నాకేమవుతోంది... (నగలు హత్తుకుని) తగ్గడంలేదే... ఏం చెయ్యాలి... (ఉక్కపోసినట్లు feeling) అయ్యో! గాలి ఆడటం లేదు..... గాలి... గాలి కావాలి.... (నగలు వదిలేసి – ఇంతకుముందు తను విసిరిన నోట్లకట్టలు తీసుకుని గబగబ గాలిసురుకున్నాడు – భార్య అన్న మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి)

**గాయ :** మీరు తేలిగ్గా తీసేస్తున్న గాలే మీకు అందకుండా పోతుందన్న క్షణంలో ఇవేవీ మిమ్మల్ని కాపాడలేవు. (అప్రయత్నంగా విసురుకుంటున్న వాడు ఆగిపోయి రొప్పుతూ ఆ డబ్బు వంక చూసాడు) గాయత్రీ ఒక్కసారి నాదగ్గరకు రావూ? గాయత్రీ... ఏవిటీ నామాట పైకి వినిపించడం లేదా? ఏవిటీ ఎవ్వరి గోడూ విన్పించుకోకుండా డబ్బు సంపాయించేను! అందుకు నా మాట ఎవరికీ వినిపించడం లేదు గాయత్రీ!.... (పత్రాలు చేతికి తగిలాయి) డాక్యుమెంట్లు! నో! ఆస్తి పాస్తులు లేని వారికి మాత్రం రోగాలు రావడం లేదా! వస్తున్నాయి. రోగాలు వస్తే బాగుచేయించుకోవడానికి కనీసం నా దగ్గర డబ్బుంది. అదీ లేకపోతే ఎంత దౌర్భాగ్యం, ఈ ఆస్థి అంతా అమ్మి అయినా నేను ఆరోగ్యవంతుడ్ని అవుతా. (పత్రాలు మీద చెయ్యి వెయ్యబోతాడు – కానీ చేయి లేవట్లేదు.)

**గాయ :** మీ నరాల వ్యవస్థ మీ మీద తిరగబడినప్పుడు, మీ అధికారం హోదా ఏదీ మీలో ప్రాణశక్తిని నింపలేదు. గుర్తుంచుకోండి. (ఆ మాటలు చెవిలో మారుమోగుతుండగా క్రిందకు వాలిపోయాడు) కళ్ళు మాత్రం తేరిపార చూస్తున్నాయి. ఉన్నట్టుండి అద్భుతమైన కాంతేదో గదంతా ఆవరించింది. ఒక ప్రక్క నుండి గాయత్రీదేవి వస్తోంది. మరో ప్రక్క సుదర్శన చక్రం వస్తోంది. సుదర్శన చక్రం గాయత్రీదేవిని చూసి వెనక్కి వెళ్ళిపోయినట్లు వెనక్కి రివ్వున వెళ్ళిపోయింది. వెనుక నుండి దివ్య స్వరమేదో ఈ శ్లోకం పలుకుతోంది.

మూఢ జహీహి దనాగమ తృష్ణాం
కురు సద్బుద్ధిం మనసివి తృష్ణాం
ఎల్లభసే నిజకర్మో పాత్తం
విత్తమ తేనా వినోదయ చిత్తం

(Lights off - Lights On)

(బంగారక్క, కేతిగాడు వచ్చారు.)

**బంగా** : ఇంతకూ మంత్రిగారు మరణించినట్టా? బ్రతికి ఉన్నట్టా?

**కేతి** : అదే సస్పెన్స్

**బంగా** : ఏమైందో చెప్పవా? ఉత్కంఠతనన్ను ఊపిరితీసుకోనివ్వట్లేదు.

**కేతి** : ఇక్కడ మంత్రిగారి పరిస్థితి ఇలా ఉంటే అక్కడ వైకుంఠంలో.

**బంగా** : ఎక్కడ?

**కేతి** : వైకుంఠంలో...

**బంగా** : ఏ వైకుంఠంలో...

**కేతి** : ఏ వైకుంఠం? భలే అడుగుతావునువ్వా....ఏ వైకుంఠమంటావే. శ్రీ మహావిష్ణువు, లక్ష్మీ సమేతంగా, నివాసముండే వైకుంఠం.

**బంగా** : ఆ వైకుంఠంలో...

**కేతి** : ఆ వైకుంఠంలో ఏమి జరుగుతుందో చూద్దాం రా!

**బంగా** : ఆగండి! మా గురించి ఏవనుకుంటున్నారు?

**కేతి** : ఇందులో అనుకునేదేవుంది!

**బంగా** : కాకపోతే ఏమిటి? ఇక్కడేదో భజగోవిందం మీద నాటకమన్నావు. చూడమన్నావు. చూస్తున్నాం. చూసినవరకు బాగుంది. ఇక్కడ నుండి వైకుంఠానికి తీసుకెళ్తున్నావు. ముందీ మంత్రి కథ పూర్తిచెయ్.

**కేతి** : ఈ మంత్రి కథ పూర్తిచెయ్యడానికే మనమొకసారి వైకుంఠానికి వెళ్ళాలి.

**బంగా** : పళ్ళు రాలగొడతాను జాగ్రత్త.

**కేతి** : నువ్వు ప్రతిదానికి నన్ను తిట్టకు! సృష్టిలో మనకు అర్థంకాని 'గొలుసు చర్య అంటే Chain reaction ఒకటి ఉంది.

**బంగా** : ఏంటా గొలుసు చర్య?

**కేతి** : అంటే నిన్నటికి ఇవాళ్టికి, ఇవాళ్టికి రేపటికి, రేపటికి ఎల్లుండికీ, అలాగే, ఇక్కడకి అక్కడికీ, అక్కడికీ అల్లక్కడికి, భూమికి దివికీ, జీవుడికి దేవుడిక, ఇహానికి, పరానికీ, ఒక సంబంధమేదో ఉంది. వాటి మధ్య సూక్ష్మ స్థాయిలో జరుగుతున్న క్రియ అదృశ్య రూపంలో ఉంటుంది.

బంగా : సరే! ఇక్కడున్న మంత్రికి, ఎక్కడో ఉన్న వైకుంఠానికి ఏవిటి సంబంధం?

కేతి : అదే! మంత్రి చచ్చాడా బతికాడా అని అడిగావుగా.

బంగా : అవును.

కేతి : అతని పై వైకుంఠంలో ఎలాంటి చర్చ జరుగుతుందో చూడు.

బంగా : చూపించు..........

**(Lights Off - Lights On)**

## (రెండవ రంగం)

తెర తొలిగింది. లక్ష్మీదేవి విష్ణుమూర్తి ఆయుధాలైన శంఖం (పాంచ జన్యం) చక్రం (సుదర్శనం) గధ (కామోదకీ) ధనస్సు (శాంగము)ఖడ్గం (నందకం) ముందేసుకొని చింతపండు పెట్టుకొని తోముతోంది.

(విష్ణుమూర్తి లోనుండి వచ్చాడు)

విష్ణు : అయ్యో! అయ్యో! నా శంఖు, చక్ర, గదా, ఖడ్గ, ధనస్సులను ఏం జేస్తున్నావు. అవి నా ఆయుధాలు లక్ష్మి.

లక్ష్మి : తెలుసు నాథా! అందుకే చింతపండు పెట్టితోముతున్నాను.

విష్ణు : హవ్వ! ఎవరైనా వింటే నవ్వరా!

లక్ష్మి : ఇప్పుడు మాత్రం నవ్వడం లేదా? మీ గురించి, మీ ఆయుధాల గురించీ దేవతాస్త్రీలంతా చెవులు కొరుక్కొని నవ్వుకుంటున్నారు.

విష్ణు : మా గురించి, మా ఆయుధాల గురించి చెవులు కొరుక్కుంటున్నారా? ఏమని?

లక్ష్మి : ఏమనా? విష్ణుమూర్తి ఆయుధాలు త్రుప్పుపట్టిపోతున్నాయి. ఆయన కెలాగూ బాధ్యత లేదు కనీసం ఆ లక్ష్మీదేవికైనా ఉండొద్దు. ఆడదన్నాక ఆయుధాలు పాడవ్వకుండా కాస్తంత చింతపండుతో తోముకోనక్కర్లేదా అని. చూస్తే అదీ నిజమేననిపించింది... త్రుప్పు ఒకంతట వదలట్లేదు... ఏదీ ఇలా ఓ చెంబుడు నీళ్ళుపొయ్యండి.

విష్ణు : ఏమా వేళాకోళం?

లక్ష్మి : దీన్నే చెబితే చిరాకు, చెప్పకపోతే పరాకంటారు.

విష్ణు : మాపట్ల మీకంత నిర్లక్ష్య భావం ఎందుకు కలిగిందో సూటిగా చెప్పండి.

**లక్ష్మి** : విధి నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ఏ భర్త పట్ల అయినా భార్యకు నిర్లక్ష్యమే ఉంటుంది.

**విష్ణు** : ఏమిటి విపరీత ధోరణి. నేను నా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నానా? దేని గురించి మీరు మాట్లాడుతున్నారు.

**లక్ష్మి** : సంకల్ప మాత్రాన సృష్టి, స్థితిలయల్ని కల్పించగలిగినవారు, స్వయంభువులు, స్వయం పోషకులు, ఈ విశ్వాంతరాలలో ఏది ఎప్పుడు ఎలా జరిగినా అన్నింటికీ కర్త, కర్మ, క్రియలుగా చెలామణి అయ్యే మీకు నేను చెప్పాలా? మీరు ఏ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారో.

**విష్ణు** : లక్ష్మీ! నామాట నమ్ము నేను నా విధుల్లో ఎప్పుడు ఏమరుపాటుగా లేను.

**లక్ష్మి** : ఏమరుపాటుగా లేకపోతే ఈ ఆయుధాలెందుకిలా త్రుప్పుపట్టిపోతాయి. గతంలో దుష్ట శిక్షణ కోసం, శిష్ట రక్షణ కోసం ఎన్నో అవతారాలు ధరించారే! దుర్మార్గుల్ని, రాక్షసుల్ని, నిర్దయగా సంహరించారే! ఇప్పుడీ ఈ ఆయుధాలిలా త్రుప్పు పట్టాయంటే ఇది ఉదాసీనత కాదా? లేకపోతే భూలోకంలో దుష్టులూ, దుర్మార్గులు లేరనే అభిప్రాయామా?

**విష్ణు** : (చిరునవ్వు నవ్వి) అదా మీ కోపానికి కారణం?

**లక్ష్మి** : అలా నవ్వకండి ఆ నవ్వే నా గుండెను రగిలిస్తుంది.

**విష్ణు** : ఈ నవ్వేలోకాల్ని వెలిగిస్తుంది కూడా.

**లక్ష్మి** : నిజమే! మీ చిద్విలాసమే లేకపోతే ఈ సృష్టి ఏమైపోతుందో కదా స్వామీ.

**విష్ణు** : ఊ! దారిలో పడ్డావు. మరి ఇంత స్ఫూర్తిమంతమైన నన్ను పట్టుకొని విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నానంటావే.

**లక్ష్మి** : ఆ మాట మాత్రం ముమ్మాటికీ నిజం. మహా సముద్రం అడుగున దాక్కొని గందరగోళం సృష్టించిన కాలకేయాది రాక్షసుల్ని సుదర్శనంతో సంహరించారు. దేవదానవ యుద్ధంలో శత్రువుల కుత్తుకలు కత్తిరించారు. శిశుపాలుని తల త్రుంచి రాజసూయయాగాన్ని నిర్విఘ్నంగా నిర్వహించారు. ప్రతీ రోజూ సకల లోకాల కార్యక్రమాల్ని ఆవిశ్వ దర్పణంలో వీక్షిస్తారే! భూలోకంలోని అధర్మాలు, అకృత్యాలు మీకంట పడట్లేదా చెప్పండి. అవి చేసే వారు మీరు సంహరించిన రాక్షసులకన్నా భిన్నమైన వాళ్ళా చెప్పండి? అలాంటి వారిని ఎందుకు ఉపేక్షిస్తున్నారు?

విష్ణు : (చిరునవ్వు)

లక్ష్మి : అదిగో అలా నవ్వితే విషయం ప్రక్కదారి పడుతుంది.

విష్ణు : నవ్వనులే చెప్పు.

లక్ష్మి : ఈ సుదర్శన ప్రయోగం ఆఖరి సారి ఎప్పుడు జరిగిందో గుర్తుందా?

విష్ణు : ఎందుకు లేదు. గజప్రాణావనోత్సాహంతో, నీ చీర చెంగు కూడా విడిచి పరుగు పరుగున వెళ్ళి మొసలి శిరస్సు ఖండించాను. అదే కదా చివరిసారి.

లక్ష్మి : అవును స్వామీ! అప్పటి మొసలి నెత్తురు మరకలింకా అలాగే ఉన్నాయి. కానీ భూలోకంలో ఆ మొసలి కన్నా భయంకరమైన నాయకులు వివిధ రూపాల్లో ప్రజల్ని పీడిస్తున్నారు. స్త్రీలపైన అత్యాచారాలు, అడ్డదారి రాజకీయాలు, భూముల అక్రమ ఆక్రమణ యధేచ్ఛగా జరుగుతున్నది. నల్లధనం హిమాలయ పర్వతాల్లా పెరుగుతోంది. ఇవన్నీ ఎవరు చేస్తున్నారు? పాలకులు లేదా వారి అండ పొందినవారు. ఇంతకు ముందు రాజులు, రాక్షసులు వేర్వేరుగా ఉండే వారు. ఇప్పుడు ఆ తేడా లేకుండాపోయింది. వారి బారి నుండి ప్రజల్ని రక్షించి ధర్మస్థాపన చేయకపోతే ఇంకెందుకీ ఆయుధాలు?

విష్ణు : నిజమే దేవీ! కానీ నేనేం చేయను?... నీకెలా చెబితే అర్థమౌతుంది?... ఊ ఇదిగో ఇలా రా! ఇదిగో. ఇతనో మంత్రి. పరమ దుర్మార్గుడు. మన ధర్మ సంహిత ప్రకారం నూరు ఘోరమైన నేరాలు చేసిన వారిపైనే ఈ సుదర్శనం ప్రయోగించాలి. ఇంత వరకు ఇతను తొంబైతొమ్మిది చేసాడు.

లక్ష్మి : అక్రమంగా రైతుల నుండి భూమి తీసుకోవడం మీ దృష్టిలో ఘోరమైన నేరం కాదా?

విష్ణు : కనుకనే రాత్రి సుదర్శనాన్ని పంపాను.

లక్ష్మి : సంహరించకుండానే పేరంటానికి వెళ్ళినట్టు, తిరిగొచ్చింది కదా!

విష్ణు : దాంట్లో దాని తప్పేమి లేదు.

లక్ష్మి : మీరే వెళ్ళినట్టు వెళ్ళి వెనక్కిరమ్మన్నారా!

విష్ణు : కాదు లక్ష్మీ! నా ఆయుధాలు సంకల్ప జనితాలు. పాపులకు ఆయుధాలు గాను, భక్తులకు ఆభరణాలుగాను గోచరిస్తాయి. ఆ మంత్రి భార్య గాయత్రీ దేవి పరమ భక్తురాలు. ధర్మవర్తనం కలది. అతన్ని సంహరించే సమయానికి ఆమె అక్కడికి రావడంతో సుదర్శనం సందిగ్ధంలో పడింది. అతన్ని

సంహరించడం కన్నా ఆమె మాంగళ్య సంరక్షణే కర్తవ్యంగా భావించి వెనక్కి వచ్చింది. ఆ విధంగా అతని ప్రాణాలు నిలిచాయి.

**లక్ష్మి** : అందుకే మరి. మగాడు దౌర్జన్యాలు చేస్తుంటాడు. ఆడది దానధర్మాలు చేస్తుంది. భర్త పాపాల్ని చేస్తుంటాడు. భార్య నోములు, వ్రతాలు చేస్తుంటుంది. భర్త చేసే పాపం భార్య చేసే పుణ్యంలో చెల్లిపోతుంది. ఇక మీకూ, మీ ఆయుధాలకీ ఎప్పటికీ విశ్రాంతే.

**విష్ణు** : ఎందుకంత కినుక నామాట పూర్తిగా వినవేమి దేవీ?

**లక్ష్మి** : ఏంటండీ వినేది, ఆనాడు హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టాడని కదా వరాహావతారంతో అతన్ని సంహరించింది. ఈ రోజు మాత్రం ఏం జరుగుతుంది? చిన్న చిన్న ముఠా నాయకులు మొదలు, పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న వారి వరకు ఎక్కడ జూసిన భూకబ్జాలే. చట్టాన్ని ఉపయోగించుకొని, వాటిలోని లొసుగుల్ని ఆధారం చేసుకొని వందల వందల ఎకరాల్ని ఆక్రమిస్తున్నారు. చిన్న చిన్న ఉద్యోగులు వారి అవసరాలు తీర్చుకోవడానికి కక్కుర్తిపడితే లంచాలు తీసుకున్నారని ఖైదులో పెడుతున్నారు. అదే రాజకీయంలో ఉన్నవారు ఒక్క ఏడాది తిరిగేసరికి కోట్లు కోట్లు డబ్బు వెనకేసుకుంటున్నారు. వారిని దండించేది, శిక్షించేది ఎవరు? భగవంతుడైన మీరుగాక!

**విష్ణు** : తప్పకుండా శిక్షిస్తాను. ఈ సృష్టి ఒక నియతికి లోబడి ఉంది. యుగ యుగానికి ధర్మపరిరక్షణ జరిగినప్పుడే ఆ నియతి కూడా సంరక్షించబడుతుంది. ధర్మ పరిరక్షణ దైవం కర్తవ్యం కనుక ఆ కర్తవ్యానికి నేనెప్పుడూ బద్ధుడ్నే.

**లక్ష్మి** : ఏ ధర్మాన్ని మీరెలా సంరక్షిస్తారో నాకు తెలీదు. మీరు మాత్రం ముందు ఆ ప్రజా నాయకుడ్ని సంహరించండి. నా మనసు ఊరట పొందుతుంది.

**విష్ణు** : ఇప్పుడా?

**లక్ష్మి** : అవును ఇప్పుడే.

**విష్ణు** : ఇప్పటికిప్పుడంటే కుదరదు.

**లక్ష్మి** : ఎందుకు?

**విష్ణు** : చట్టబద్ధత, ధర్మ బద్ధత అని రెండు విషయాలున్నవి.

**లక్ష్మి** : రెండింటికీ తేడా ఏమిటో?

**విష్ణు** : ఆ ప్రజా నాయకుడు రైతుల భూములు కాజేసిన వ్యవహారమంతా చట్ట బద్ధంగానే జరిగింది. భూ సేకరణ దగ్గర నుండి మళ్ళీ విక్రయించే వరకు ఎక్కడా చట్టాన్ని ఉల్లంఘించడం జరుగలేదు. అదే విధంగా తన పేరుగానీ, తన వాళ్ళ ప్రమేయంగానీ కనిపించదు. భూలోకంలో ఎవరి పేరు మీద ఏముందో, ఏమి జరుగుతుందో పరబ్రహ్మకు కూడా సాధ్యపడదు. అన్నీ బినామీ వ్యవహారాలే.

**లక్ష్మి** : అయితే ఒక పనిచేద్దాం ప్రభూ! మనమే భూలోకం వెళ్దాం. అతనికి దగ్గరగా ఉండి ఆయన చర్యల్ని గమనిద్దాం. నూరోతప్పు చేసిన వెంటనే అతని శిరస్సు సుదర్శనంతో ఖండించవచ్చు. ఏవంటారు?

**విష్ణు** : నిజమే! కేవలం ధర్మాతిక్రమణే కాదు చట్టాతిక్రమణ జరిగినప్పుడు మాత్రమే తప్పుగా పరిగణించాలి. నువు ప్రక్క నుండి ప్రతీ చిన్న విషయానికి అతన్ని చంపమని నన్ను ప్రేరేపించకూడదు.

**లక్ష్మి** : సరే. మీరు కూడా చట్టం, ధర్మం, అనే మీమాంసలో అతని నేరాల్ని వదిలివేయకూడదు.

**విష్ణు** : వదిలివేయను, నా ధర్మ బద్ధతే నాకు ప్రమాణం.

**లక్ష్మి** : నాకు నామనస్సాక్షే కొలబద్ద. అనవసరంగా నేను మిమ్మల్ని ప్రేరేపించను. కానీ నా మనస్సుకి బలంగా తోచినప్పుడు మీకు సంజ్ఞ చేస్తాను, మీరు దాన్ని త్రోసిపుచ్చకూడదు. సరేనా!

**విష్ణు** : స్సరే బయల్దేరు, భూలోకానికి.

**(Lights Off - Lights On)**

## 3వ రంగం

మంత్రి ఫోనులో మాట్లాడుతున్నాడు.

**మంత్రి** : ఆ! ఆ! వాళ్ళకీ, ఆ భూములకు ఏంటి సంబంధం? జెండాలు పాతుతున్నారా? పీకెయ్యకుండా మీరేంజేస్తున్నారు. నన్నెందుకు అడగడం. ఏం చెప్పందే చెయ్యరా! పీకెయ్యండి. వెంటనే పీకెయ్యండి! ఎక్కడా ఒక్కటి కూడా కనిపించడానికి వీల్లేదు. అంగుళం భూమి పోయినా మీ అంతుజూస్తాను. (ఫోను పెట్టేశాడు) (లో నుండి మాత్రలు మంచినీళ్ళు పట్టుకొని వచ్చింది)

**గాయ :** ఎందుకండీ ప్రతిదానికి అలా ఆవేశపడతారు? శాంతిశ్చేత్ కవచేన కిం. శాంతంగా ఉన్న వారికి కవచంతో అవసరం లేదు.

**మంత్రి :** ఏంటి మళ్ళీ నీతిశతకమా?

**గాయ :** మంచి మాటలు ఎన్నిసార్లు విన్నా మంచిదే. సుభాషితం బహుదాశృతం. ఇదిగో మందులు వేసుకోండి.

**మంత్రి :** (మాత్రలు వేసుకొని) ఒకప్రక్క మందుల్తో బ్రతికిస్తావు. మరోప్రక్క మాటల్తో చంపుతుంటావు.

**గాయ :** మంచిమాట కూడా మందు లాంటిదే. శరీర రోగాన్ని ఈ మందులు బాగు చేస్తే మానసిక రోగాల్ని మంచి మాటలే నయం చేస్తాయి. మొన్న బ్రతికారంటే అది దేవుని కృపే.

**మంత్రి :** ఛ ఊరుకో! నువ్వొచ్చి మాత్రవెయ్యేకపోతే బతికేవాడ్ని కాదు.

**గాయ :** కానీ ఆ మాత్ర నేనెలా వెయ్యగలిగాను. నేనక్కడకు రాబట్టి. నేనక్కడికి ఎలా రాగలిగాను? అంత గాఢ నిద్రలో ఉండి ఎలా లేవగలిగాను? ఎవరో భజగోవిందంలోని "మూఢ జహీహి" శ్లోకం చెవిలో చెప్పినట్టయింది. ఠక్కున లేచి కూర్చున్నాను. నిజ్జంగా, ఎవరో తట్టి లేపినట్టయిందనుకోండి. మీరు విన్నారో లేదో ఆ శ్లోకం చదువుకుంటూనే మీ దగ్గరకొచ్చాను. దైవ సంకల్పం లేనిదే ఇదంతా ఎలా జరుగుతుందనుకున్నారు.

**మంత్రి :** గాడిద గుడ్డేం కాదు. చూడూ! నాకు తెల్సిన సూత్రం ఒక్కటే, ఈ లోకంలో బలమున్నవాడు బ్రతుకుతాడు. అది లేనివాడు చస్తాడు.

**గాయ :** చావడు. అది లేనివాడికి భగవంతుడే బలమైనిలుస్తాడు.

**మంత్రి :** అది కేవలం నీ భ్రమ.

**గాయ :** అదే నిజం. అది మాత్రమే నిజం. ఎందుకంటే మనిషికన్నా ఎన్నో బలమైన జంతువులున్నాయి. క్రూరమైన మృగాలున్నాయి. కానీ మనిషికి దేవుని మీద ఉండే నమ్మకం, భక్తే వాడ్ని ముందుకు నడిపిస్తోంది. ఇంకా ఇంకా బ్రతికిస్తోంది.

**మంత్రి :** అంటే ఏంటంటావు. రేపటి నుండి నీతో పాటు నేనూ 'భజగోవిందం, భజగోవిందమని' భజన చేసుకుంటూ కూర్చోవాలా? చెవిలో పువ్వులు పెట్టుకొని 'దేవుడా'! నువ్వే నన్ను బ్రతికించావు, కాబట్టి నా దగ్గరున్న డబ్బు, దస్కం ఖర్చు పెట్టి నీకు గుడులు గోపురాలు కట్టిస్తాను, అని మొక్కుకోవాలా?

**గాయ :** దానికీ కూడా అదృష్టముండాలండీ! ఆ నాడు ఎంతో మంది కుబేరులు, కోటీశ్వర్లూ ఉన్నారు. కానీ రామదాసుకే ఎందుకు రాముని గుడి కట్టే అవకాశం దక్కింది. ఒక చోట దేవుడు "నీ కోసం నీ దగ్గరున్న సంపదనంతా ఖర్చు పెట్టుకోగలవు. కానీ నా అనుమతి లేనిదే నా కోసం చిల్లిగవ్వ కూడా ఖర్చుపెట్టలేవు" అని అన్నాడు. ఎప్పుడో ఒకప్పుడు దేవుని మీద మీకు నమ్మకం కలగొచ్చు. భక్తీ కలగొచ్చు. మీకున్నదంతా అతనికిచ్చెయ్యాలనే తపన ఉప్పొంగవచ్చు. కానీ స్వీకరించడానికి దేవుడు కాదు కదా అతని నీడ కూడా మీకు అందుబాటులో ఉండకపోవచ్చు.

**మంత్రి :** పిచ్చి మొహమా? ఈ దేశ చరిత్ర, ప్రస్తుత పరిస్థితి నీకర్థం కావట్లేదు. ఇక్కడున్నంత మంది దేవుళ్ళు ప్రపంచంలో మరెక్కడా లేరు. ఆ దేవుళ్ళకు తగినట్టుగానే నూటికి తొంబయి తొమ్మిది మంది భక్తులే. ప్రతీ భక్తుని వెనుక చూస్తే, ఒక ఆకలి, ఒక వరం, ఒక అవసరం, ఒక కోరిక, ఒక కాంక్ష ఇలా ఏదో ఒకటి ఉంటుంది. ఈ దేశంలో లంచమనే పదం ఎక్కడ నుండి పుట్టిందో తెల్సా? భక్తుని నెత్తి మీద పెట్టే శఠగోపం నుండి, కానుకలు స్వీకరించే హుండీ నుండి నేను నా ఆస్థిని ఇవ్వాలనుకునే మరుక్షణం శివశంకరంగారూ, శివశంకరం గారూ మీ ఆస్థి 'నా హుండీలో వెయ్యండి, నా హుండీలో వెయ్యండని' – వంద మంది దేవుళ్ళు నా ఇంటి కాలింగ్ బెల్ నొక్కుతారు. (కాలింగ్ బెల్ మ్రోగింది) చూడు ఏ దేవుడు వచ్చాడో. (గాయత్రీదేవి వెళ్ళి, తలుపులు తీసి)

**గాయ :** ఎవరు మీరు? (బయట నుండి విష్ణుమూర్తి, లక్ష్మిదేవి పనివాళ్ళ వేషంలో వచ్చారు. విష్ణుమూర్తి చేతిలో సుదర్శన చక్రం ఉంది.)

**లక్ష్మి :** మేము పనోళ్ళమమ్మా! మీ ఇంట్లో పనుందని తెల్సి వచ్చామమ్మా. జరింత పనివ్వండమ్మ. మీ కాల్మొక్కుతా.

**గాయ :** రండి రండి! ఇంట్లో పనంతా ఒక్కదాన్ని చేసుకోలేకపోతున్నాను. వాళ్ళను మాత్రం అక్కడెక్కడో ఉండమంటే నేను ఒప్పుకోను.

**మంత్రి :** (నవ్వుతూ) అదేంటి? దేవుడొచ్చాడనుకుంటే పనోడొచ్చాడు.

**విష్ణు :** అంతగా నవ్వబాకండయ్యా! పని పట్టేటోడే పనోడైతే, ఆ పనోడే దేవుడు అవుతాడయ్యా! గుర్తించగలిగితే పనోడూ దేవుడూ ఒకడేనయ్యా!

**మంత్రి :** ఏంట్రా ఆ తలబిరుసు మాటలు.

లక్ష్మి : కోపగించకండయ్యా! ఆ మనిషికి సరిగ్గా మాటాడ్డం రాదు.

మంత్రి : నీకొచ్చుగా. వాడి ఉద్దేశ్యమేంటో నువు చెప్పు. పనిపట్టేటోడు పనోడా. ఏమిటి వాడంటున్నది?

లక్ష్మి : పని పట్టేవాడుకాదయ్య పానీపట్టేవాడు పనోడైతే, ఆ పనోడే దేవుడవుతా డన్నాడయ్యా! హైద్రాబాద్‌లో నీటికి కటకట కదయ్య. అంత కన్నా ఇందల సెడుద్దేశ్యం లేదు దొర... అరె అట్ల జూస్తావేమి? దొర కాల్మొక్కు... కాల్మొక్కు.

మంత్రి : స్సరే! స్సరే!... పన్జూసుకోండి... (లోనకు వెళ్ళబోయి ఆగాడు) ఆ చేతిలో దేంట్రా!

విష్ణు : సుదర్శనం

లక్ష్మి : (మోచేత్తో పొడించింది) అదేంది సారూ! పిచ్చి పిచ్చి చక్రం.

గాయ : దీంతో ఏంజేస్తావురా

విష్ణు : ఏంజేస్తానమ్మా! దుష్ట శిక్షణ జేస్తాను.

మంత్రి : అంటే

లక్ష్మి : అదే సారూ! మొక్కలు లెక్కలేకంట జబర్దస్తీగా పెరిగినాయనుకోండి... ఇది పెట్టి పరపరా నరుక్కుంటాబోతాడు.

విష్ణు : తలకాయల్తరగాల!

మంత్రి : ఏం? తరుగుతావు?

లక్ష్మి : కూరగాయల్తరగాల. ఈ సెక్రం బెట్టి....

విష్ణు : నరుకుతాబోతా!

మంత్రి : స్స రే స్సరే! (లోనకు వెళ్ళాడు)

లక్ష్మి : అమ్మా! ఇక మీరు పూర్తిగా రెస్ట్ తీసుకోండి. అన్నీ పనులు చేజేస్తా. కిచెన్ ఎక్కడుందమ్మా! (కిచెన్ వైపు వెళ్ళింది)

గాయ : ఇంత చిన్న చక్రంతో ఇన్ని పనులు చేసే బదులు మరో రెండు పనిముట్లు చేయించుకోకూడదు.

విష్ణు : నయా వస్తువులు ఎందుకు అమ్మా. పురాణా ఆయుధాలు మస్తుగున్నవి. ఇదిగో ఏయ్ లచ్చింబాయి అమ్మకు సమ్జ్ అయినట్టు చేస్తున్నా. ఒక గదా

ఉంది. ఒక బాణం ఉంది. ఒక తల్వార్ ఉంది. ఒక శంఖు ఉంది. ఇవీ అమ్మా మాకూ తరతరాల్నుండి వస్తున్న ఆయుధాల్.

**గాయ** : ఇవన్నీ దేని కోసం ఉపయోగిస్తావ్?

**విష్ణు** : నేను మేయిన్‌గా చేసేది తోటమాలి నౌకరిగదమ్మా! తోటలో రకరకాల చెట్లుంటాయి కదమ్మా! ఒక్క చెట్టు కత్తిపెట్టి నరికితే చాలు చెప్పినట్టు ఇంటాది. మరోటి గదతో నాలుగు గుద్దులు పడితేగాని మాట వినదు. ఇంకోటి బాగా పెరిగి కన్నూమిన్నూగానక చేతికి అందకుండా పోతుంది. దానికి బాణమేసి సరిజేస్తాను. ఇక దేనికీ లొంగకుండా పొగరుబట్టి ఉంటాయి కొన్ని చెట్లు. అవి నరకాలంటే ఇదిగో ఈ సుదర్శనం వాడుతాను. ఎప్పుడూ ఏ ఆయుధం వాడినా, సూచనగా ముందు శంఖం పూరిస్తాను. శంఖం పూరించాను అంటే ఎవరికో మూడినట్టే లెఖ్ఖ.

**గాయ** : ఆ!

**విష్ణు** : అదేనమ్మా! ఏదో ఒక చెట్టు నేలకు ఒరిగినట్టే లెఖ్ఖ.

**లక్ష్మి** : (లో నుండి వస్తూ) అతనివన్నీ పోచుకోలు మాట్లమ్మా! అవేవీ నమ్మకండి తల్లీ.

**విష్ణు** : ఏమ్టీ లచ్మీంబాయి మాటలు జాస్తి అవుతున్నాయి.

**గాయ** : మీరిద్దరిలా రండి (ఇద్దరూ వచ్చి ఎదురుగా నిల్చున్నారు) .... నిజం చెప్పండి. మీరెవరు? ఎక్కడ నుండి వచ్చారు?

**విష్ణు** : మేమా!

**లక్ష్మి** : మేమేనమ్మా! పని మనుషులం.

**గాయ** : కాదు మీరెవరో నాకర్థమైంది.

**విష్ణు** : ఎంటమ్మా! ఏమర్థమైంది.

**లక్ష్మి** : నిజ్జంగా మేము పనిమనుషులమేనమ్మా! నీ కాల్మొక్కుతా నామాటనమ్ము.

**గాయ** : లేదు మీరు పనిమనుషులు కారు. మీరు.. మీరెవరో చెప్పమంటారా?

**ఇద్దరు** : చెప్పండి.

**గాయ** : మీరు నక్సలైట్లు కదూ!

**ఇద్దరు** : హమ్మయ్య!

**విష్ణు** : నిజంగా గుర్తు పట్టారేమోననుకున్నా!

**లక్ష్మి :** అదే మట్లంటావ్, మనమేమైనా మారు వేషాల్లో ఉన్నామా? గుర్తుపట్టారంటావ్?

**గాయ :** మీరైతే మాత్రం పని మనుష్యులు కారు. ఎప్పటికైనా మిమ్మల్ని నేను గుర్తుపడతా. మీ అసలు స్వరూపమేంటో చెబుతాను.

**లక్ష్మి :** అమ్మో! నేలోనకుబోయి అంట్లు దోముకుంటా (లోనకు జారుకుంది) (లోనుండి మంత్రి ఢాం ఢాం మ్మంటూ సెల్‌లో మాట్లాడుతున్నాడు)

**మంత్రి :** Nothing doing! సెక్రటరీగారూ నాకీ సుద్దులు చెప్పకండి I tell you, you have to do it at any cost. That is all... come here immediately. Yes I am in my residence. ఒరేయ్... నీ పేరేంట్రా?

**విష్ణు :** ఇష్ణండీ.

**మంత్రి :** (మరో నెంబర్‌లో మాట్టాడం ప్రారంభించాడు) ఆ! నేనే మాట్లాడుతున్నాను. పి.ఎస్.ని, పి.ఏ.లను పేషీకి వెళ్లమను. నేను ఆఫీసుకు వస్తున్నాను. (ఇంకో నెంబర్‌తో డయల్ చేసాడు) ఆ! బాబూ! ఎలా ఉన్నావు?... నేనా! నేను బాగున్నాను. అమ్మ always alright. OK. నీ resignation accept అయిందా? congratulations. ఇండియా వచ్చేసెయ్. నీ రాజకీయ జీవితానికి ఇక్కడ గట్టిపునాదులు వేసాను. ఇంత వరకు రాజకీయ రంగంలో ఏ తండ్రీ ఏ కొడుక్కి అమర్చలేనంత నీ కోసం నేను అమిర్చిపెట్టాను. ఒక ఛానెల్, ఒక పేపర్, ఒక నియోజక వర్గం, కేడర్, కార్యకర్తలు, కోట్లాది రూపాయలు – ఇవన్నీ చాలా చాలా పకడ్బందీగా చేసి పెట్టాను... ఏం లేదు నాన్నా! నేను నీకు చేసినట్టే నువు నీ పిల్లలకు, ఆ పిల్లలు వాళ్ళ పిల్లలకు చేసుకుంటూ పోయారనుకో. అధికారమన్నది మనింటి గుమ్మందాటిపోదు.... అదీ...thats right. అయితే ఎల్లుండి బయలేరుతున్నావు. OK. తర్వాత మన నియోజకవర్గంలో పెద్ద డిన్నర్ ఏర్పాటు చేసి వాళ్ళందరికీ నిన్ను నా వారసుడుగా పరిచయం చేస్తాను. అప్పుడే నీ రాజకీయ భవిషత్తుకి తొలిపునాది రాయిని వేస్తాను. OK. All the best.

(అలా అంటూ టి.వి. వైపు) చూసాడు.... (అలాచూస్తూ చూస్తూ సీరియస్ అయిపోయాడు) ఏంట్రా అది... ఒరేయ్ విష్ణు... నీకు చదువొస్తాదా? టి.వి.లో ప్లాష్ న్యూస్... ప్లాష్ న్యూస్ అని వస్తుందే... అది ఒక్కసారి చదువు. నాకళ్ళను నేను నమ్మలేకపోతున్నాను. ఒరేయ్ ఒక్కసారి గిచ్చురా! (విష్ణు

దూరంగా ఉన్నాడు కానీ అక్కడ నుండే గిచ్చినట్టు నటించాడు – ఇక్కడ మంత్రి గిచ్చినట్టు ఫీలయ్యాడు) అయితే ఇది నిజమేనన్న మాట... మంత్రి శివశంకరం మీద 99 చార్జెస్‌తో హైకోర్టులో రిట్... గాయత్రీ... ఒసేయ్ గాయత్రీ... శాస్త్రాలు చదివినదానా ఒక్కసారి రావే...

**గాయ** : (వస్తూ) ఏంటండీ.... (ఆ వెనక లక్ష్మీదేవి కూడా వచ్చింది)

**మంత్రి** : ఇన్నాళ్ళు అడక్కపోయిన అడ్డమైన పద్యాలు, శ్లోకాలు చదివి, చదివి నా బుర్ర తిన్నావు కదే! ఇప్పుడు అడుగుతున్నాను, ఆ ఫ్లాష్ న్యూస్ అని స్క్రోలింగ్ వస్తోంది చూడు. అది చదివి నా గురించి కాదని ఒక్క మాట చెప్పవే.

**గాయ** : (చదివింది) మంత్రి శివశంకరం మీద 99 చార్జెస్ మోపుతూ ప్రముఖ న్యాయవాది రామనాథం హైకోర్టులో తగిన ఆధారాలతో రిట్‌పిటిషన్ దాఖలు చేసారు. ఈ రిట్‌పై lunch motion లో హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అవకాశముంది. (విష్ణు, లక్ష్మి ఒక దగ్గరికి చేరారు)

**విష్ణు** : చూసావా మన లెక్క వీళ్ళ లెక్క సరిగ్గా సరిపోయింది.

**లక్ష్మి** : లెఖ్ఖ ఎప్పుడూ సరిపోతుంది. నూరో తప్పు జరిగిన వెంటనే సుదర్శనాన్ని ప్రయోగించండి.

**విష్ణు** : అలాగే!

**మంత్రి** : అంతేనా!

**గాయ** : ఉండండి! మధ్యలో Advertisements వస్తున్నాయి.

**మంత్రి** : కక్కుర్తి నా కొడుకులు. ప్రతీది డబ్బే. Important News ఇస్తూ కూడా యాడ్స్ ఇవ్వాలా! డబ్బు కోసం ఏమైనా చేస్తారు. వెధవలు.

**గాయ** : ఇది మనకు Partnership ఉన్న ఛానలే S-TV

**మంత్రి** : ఏంటీ ఇది మన టీవీ యా?

**గాయ** : అవునండీ

**మంత్రి** : ఇంకా ఏ మొస్తుందో చదువు.

**గాయ** : మంత్రిపై మోపిన అభియోగాలన్నిటికీ ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని వాటిని పరిశీలించి, అతనిని మంత్రి వర్గం నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు.

**మంత్రి :** (ఎదురుగా ఉన్న వస్తువు తీసుకొని నేలకేసి కొట్టాడు) ప్రాథమిక సాక్ష్యాధారాలు? ఎక్కడి నుండి వచ్చాయి? ఎవరిచ్చారు?

**గాయ :** అస్సలు వాళ్ళు ఏ చార్జెస్ పెట్టారో తెల్సుకోకుండానే ఎందుకలా అవుతారు. ముందా విషయం తెల్సుకోండి.

**మంత్రి :** ఒరేయ్ విష్ణు!

**విష్ణు :** అయ్యా!

**మంత్రి :** నీకు ఫోను డైల్ చెయ్యడం వచ్చా?

**విష్ణు :** ఓ వస్తాదయ్యా!

**మంత్రి :** ఫోనుచెయ్! ఎస్–టి.వి. యం.డి.కి ఫోన్‌చెయ్.

**విష్ణు :** (చెయ్యిపైకి చాచాడు) చేతిలోకి ఓ మొబైల్ ఫోను వచ్చి పడింది) హలో! ఎస్–టి.వి. యం.డి. గారా? మంత్రి సాబ్ మాట్లాడుతారు.

**మంత్రి :** (ఫోనులో) ఏంటయ్యా ఇది....ఏంటి ఇలాంటి న్యూస్ ఇస్తున్నావు...ఆ! మీటింగ్‌లో ఉన్నావా? మాట్లాడు. ఫోనులో కాదు గానీ అర్జంటుగా నాదగ్గరకు రా!.... సాయంత్రం కాదు... right now, straight గా ఇంటికొచ్చెయ్! ఆ! (చాలా టెన్షన్ పడుతున్నాడు)

**గాయ :** మీ సెక్రటరీకి ఫోన్జేస్తే తెలుస్తుందేమో!

**మంత్రి :** ఆ కరక్టు! (విష్ణుతో) ఏదీ సెక్రటరీకి కలుపు

**విష్ణు :** (మళ్ళీ చేతిని పైకెత్తాడు – మరో సెల్ వచ్చిపడింది. హలో! మంత్రిగారు మాట్లాడుతారు.

**మంత్రి :** హలో! ఆ! మీరూ చూసారా!....99 చార్జెస్ పెట్టారట. ఒక్కసారి ఇంటికి రండి. సి.ఎస్. మీటింగులో ఉన్నారా? (రిసీవర్ మూసి) మీటింగ్ అనే మాటతో దేనినైనా తప్పించుకోవచ్చు. స్సరే ఆ మీటింగ్ చూసుకొని ఇంటికి రండి. (ఫోను పెట్టేశాడు)

**గాయ :** ....ఇక ఆ ఛానల్స్ వాళ్ళు, ప్రెస్‌వాళ్ళు మీ మీదకు దండెత్తుతారు. వాళ్ళకేమి చెప్పాలో రడీ అవ్వండి. ప్రతీ తప్పుకి ఏదో ఒక రోజు మనం సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని ఎప్పుడో చెప్పాను.

**మంత్రి :** నువు నోర్ముయ్!

**గాయ** : పేపర్ పెట్టినంత మాత్రాన పాపాలు పోతాయా! టి.వి. పెడితే తప్పులు ఒప్పులౌతాయా? పేపర్ అండ, ఛానెల్ నీడ ఎంతవరకుంటాయి. ఇటు గాలి అటు మళ్ళితే సరి.
కురుతే గంగా సాగరగమనం
వ్రతపరిపాలన అథవాదానం...
జ్ఞాన విహీనః సర్వమతేన
ముక్తిమ్ న భజతే జన్మశతేన.

**విష్ణు** : అంటే ఏంటమ్మ.

**గాయ** : అంటే ఒక ప్రక్క పాపాలు చేస్తూ, మరో ప్రక్క గంగాసాన్నాలు చేసినా, వ్రతాలు దానాలు చేసినా ముక్తిరాదని చెప్పాడు ఆది శంకరులు.

**మంత్రి** : (టేబిల్ మీద కత్తి తీసుకొని ఆమె ముందుకిసిరాడు) ఒసేయ్! పొడిచెయ్ వే! ఆ కత్తితో ఒక్కసారిగా పొడిచేస్తే ఏ గొడవా వుండదు.

**లక్ష్మి** : (గాయత్రీదేవితో) అమ్మా! మీరిలారండి....జర మనం లోనకు బోయి వంట చేసుకుందాం.

**మంత్రి** : ఆ పన్జెయ్! లోనకు తగలడు.

**గాయ** : దేవుని లీలలు దగ్గరుండి చూస్తేనే బాగా అర్థమౌతాయి. సర్లే నాకెందుకుగానీ... (లక్ష్మీదేవి, గాయత్రీ లోనకు వెళ్ళారు)

**మంత్రి** : ఒరేయ్ విష్ణు! అన్ని ఫోన్లు ఆఫ్ చేసేయ్! బయట సెక్యూరిటీకి చెప్పు... ఎవర్నీ లోనకు పంపొద్దని.. (విష్ణు బయటకు వెళ్ళాడు) ముఖ్యంగా చేతిలో మైక్, భుజం మీద కెమేరా పట్టుకొని వస్తారు. వాళ్ళనెవర్నీ.. ఇప్పుడెలాంటి ప్రశ్నలు అడుగుతారని... అమ్మో! అది మైకు కాదు నైఫ్... ఒక్కో ప్రశ్న అడుగుతుంటే ఒక్కో పోటు పొడుస్తున్నట్టే. భుజం మీద కెమేరా పెట్టి తిప్పుతుంటే మన కళ్ళెదురుగా మన శవాన్ని మోసుకెల్తున్నట్టే ఉంటుంది. అమ్మో! (విష్ణు బయట నుండి వచ్చాడు) అరేయ్! చెప్పేసావా! ఎవడ్నీ వదలొద్దని చెప్పావా?

**విష్ణు** : చెప్పా సార్! ఆ ఛానెల్ యం.డి.ని మాత్రం ఇడచమన్నా సార్!

**మంత్రి** : వాడికి మళ్ళా ఫోను గొట్టు. (కాలింగ్ బెల్ మ్రోగింది)
come in ... (విష్ణుతో) చూసుకో చేతిలో మైకుంటే మాత్రం బయటకునెట్టు...

**విష్ణు** : అలాగే సార్! (వెళ్ళబోతుండగా బయట నుండి యం.డి. వచ్చాడు)

MD : నమస్తే సార్!

**మంత్రి :** ఏంట్రా నువు చేసిన పని.

MD : నేనేం చేసాను సార్!... మన ఛానెల్ ఇవ్వకపోతే మరో ఛానల్ ఇవ్వదా? మనకిప్పుడెంత పేరొస్తుందో చూడండి.

**మంత్రి :** నా కొడకా! ఇక్కడ పదవి పోయేటట్టుంటే నీకు పేరు కావాల్సి వచ్చిందిరా?

MD : పదవి ఎక్కడికి పోతుంది సార్! ఇలాంటి రిట్స్‌కి, న్యూస్‌కి పదవులు పోతే ఈ దేశం ఎప్పుడో బాగుపడివుండేది. మీరు ధైర్యంగా ఉండండి ఈవినింగ్ బులిటెన్ నేను కవర్ చేస్తానుగా.

**మంత్రి :** ఏంట్రా! ఏంట్రా! ఆ ధైర్యమేంట్రా? ముందు ముఖాన పేడ జల్లి తర్వాత సెంటుపూస్తావా?

MD : పబ్లిసిటీ ఫిలాసఫీ అదే కదా సార్! సొంత వాడైతే సెంటు, పరాయి వాడైతే పేడ జల్లుకుంటూ పోతాంగదా సార్.

**మంత్రి :** ఇప్పుడు నేను సొంతవాడ్నా, పరాయివాడ్నా... చెప్పరా నేను స్వంతమా? పరాయా? ఆ ఛానెల్ నాదిరా! దాంట్లో 40% షేర్స్ నావిరా! అడ్డగోలుగా సంపాదించిన డబ్బుంతా గోనె సంచుల్లో తెచ్చి ఛానెల్ క్రింద పెట్టానురా. సైకిల్ మీద తిరిగే నా కొడుకువి... హాస్టల్ రూముల్లో పాంప్లెట్స్ పంచుకునే వెధవ్వి.. నిన్ను తెచ్చి యం.డి.ని చేస్తే, కనీసం న్యూస్ ఇస్తున్నప్పుడు నాకు చెప్పనక్కర్లేదురా! ఇలా మీ మీద న్యూస్ వచ్చింది. ఇప్పుడెయ్యమంటారా? వద్దంటారా అని ఒక్క మాట అడగాలనిపించలేదురా.

MD : TRPs పడిపోతున్నాయి. ఏం చేసైనా TRP లు పెంచండని మీరేగా అన్నారు.

**మంత్రి :** TRPలు పెంచుకోవాల్సింది మనమీద మనం న్యూస్ వేసుకొని కాదురా. పరాయివాళ్ళ మీద. నా కొడుకుని నా రాజకీయ వారసుడిగా చెయ్యాలని అమెరికా నుండి రప్పిస్తుంటే, నీ తెలివి తక్కువ తనంతో నా పొలిటికల్ కెరియర్ నే దెబ్బగొట్టావు కదరా!

MD : ఏంటండీ మరీ respect లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతారు. డబ్బు మీరు పెట్టారు. కానీ నా తెలివితేటల్లేకుండానే ఛానెల్ ఈ స్థాయికి వచ్చిందా.

**మంత్రి :** చెప్పుతో కొడతా ఎక్కువ మాట్లాడావంటే. నీ తెలివి లేకపోతే, ఛానల్ పైకి రాదా? ఏంట్రా నీ చావు తెలివి? డాన్సులు చెయ్యించడం! పాటలు పాడించడం! ఎప్పుడు చూసినా ఇదేగా. ఈ తొక్కలో కార్యక్రమాలకు పైగా నీ పేరెమో క్రియేటివ్ హెడ్ అనే కార్డు.

MD : స్సరే. మీ దగ్గర ఇంత అవమానం జరిగాక ఇక అసలు విషయం చెబుతాను వినండి. అవతలి పార్టీవాళ్ళు వేరే ఛానెల్ పెడుతున్నారు. ఆ కంపెనీకి CEO గా రమ్మని నాదగ్గరికొచ్చి మరీ బ్రతిమాల్తున్నారు. మీ ఫోనొచ్చే సరికి వాళ్ళతోనే మాట్లాడుతున్నాను. మీకిష్టం లేకపోతే చెప్పండి, పోతాను. అవతల ఆఫర్ రెడీగా వుంది.

**మంత్రి** : (కత్తి తీసుకున్నాడు) నా కొడకా! నిన్ను పొడిచి చంపుతా.

(లక్ష్మి, విష్ణుకి సుదర్శనం వదలమని సంజ్ఞ చేస్తుంది. అతను వారిస్తుంటాడు)

MD : ఏంటి కత్తి తీస్తావా? పొడుస్తావా?... ఏదీ పొడువు (షర్టు కాలర్ నుండి ఓ చిన్న మైక్ తీసాడు). ఇందేంటో తెల్సా! Micro Camera నువ్విలాంటి వాడివనే నా జాగ్రత్తలో నేనొచ్చాను. మొత్తం రికార్డ్ చేసాను. నాకేదైనా అపకారం చేయడానికి ప్రయత్నించావో, మొత్తం టెలికాస్ట్ చేస్తాను. జాగ్రత్త! వస్తా (వెళ్ళబోయి ఆగాడు) మంచి పనులు చేసేవారి సంగతి ప్రక్కన బెట్టు. మంచి మాటలు చెప్పేవారు కూడా లేకుండా పోతున్న రోజులివి. కానీ నీ అదృష్టం కొలదీ సాక్షాత్తూ సరస్వతీ దేవి లాంటి భార్య దొరికింది. కొన్ని అయినా ఆమె చెప్పినట్టు విను. బాగుపడుతావు. (వెళ్ళిపోయాడు) (అలా చేతలుడిగి కూలబడిపోయాడు) (గాయత్రీదేవి మంచి నీళ్ళు తీసుకొని వచ్చింది).

**గాయ** : మంచి నీళ్ళు త్రాగండి!

**మంత్రి** : (గ్లాసు విసిరికొట్టాడు) ఫో అవతలకు! నీ ముఖం నాకు చూపించకు. ఒరేయ్ విష్ణు! మన లాయర్స్‌కి ఫోను జేసి అర్జంటుగా నాతో మాట్లాడమను. (లోనకు వెళ్ళాడు) (అతన్ని వెంబడిస్తూ వెళ్ళింది గాయత్రీ దేవి.)

**విష్ణు** : (ఫోను డయల్ చేసి) ఆ లాయర్‌గారు! మంత్రి సార్‌తో మాట్లాడండి. (ఏదో చేసి లోనకు ఫోను కనెక్టు చేసాడు.)

**లక్ష్మి** : (కోపంగా చూస్తోంది)

**విష్ణు** : నాకు తెల్సు తమరు కోపంగా ఉన్నారని

**లక్ష్మి** : నాకూ తెల్సు తమరెందుకూ పనికిరారని.

**విష్ణు** : లక్ష్మి!

**లక్ష్మి** : ఎందుకలా కోపగిస్తారు. అతన్ని చంపపోయేడు, అది నూరో తప్పు కాదా? అప్పుడాయన శిక్షార్హుడు కాదా?

**విష్ణు :** కాదనే భారతీయ శిక్షాస్మృతి చెప్తుంది. పరిస్థితులకు ప్రభావితమై చేసిన నేరం, అంత తీవ్రమైంది కాదని ఎన్నో తీర్పులున్నాయి.

**లక్ష్మి :** మీ దగ్గర తప్పుని సమర్థించుకొనే నేర్పు ఉందిలెండి. (లోనుండి మంత్రి, గాయత్రీ వచ్చారు. ఆయనింకా టెన్షన్‌లోనే ఉన్నాడు. అతన్ని ఆమేదో సర్ది చెప్పే ప్రయత్నం చేస్తుంది. వాళ్ళను చూసి సర్దుకున్నారు).

**గాయ :** భారతంలో ఏమైందో తెల్సా? పంచభూతాలు, ధర్మం, ఉభయ సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు, రేయింబవళ్ళు, అనే మహా పదార్థాలు చూస్తుండగా అధర్మం ఎలా చేస్తారని అడిగింది ఓ పతివ్రత.

**మంత్రి :** భారతదేశంలో ఏం జరుగుతుందో తెల్సా?

రాజ్యాంగం, చట్టాలు, న్యాయం, న్యాయస్థానాలు, పోలీసులు, శాసనసభ, పార్లమెంటు, ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అనే మహా వ్యవస్థలు చూస్తుండగానే అన్నీ అన్యాయాలు జరుగుతున్నాయి. మిగతావారి కంటే నేను చేసింది, చాలా చాలా తక్కువ. నా ప్రాణాలు తోడెయ్యకుండా నన్ను కాస్త ప్రశాంతంగా ఉండనీ. (బయట నుండి సెక్రటరీగారొచ్చారు)

సెక్ర : నమస్తే సార్.

**మంత్రి :** నమస్తే! మీ కోసమే చూస్తున్నాను.

సెక్ర : నేనా ఆఫిడవిట్ కాపీ తెప్పించి చూసాను సార్! ఈ files అన్ని చాలా confidential గాఉన్నాయి. ఎక్కడా leak అవడానికి వీల్లేదు. But some how they managed to get the information. How it was possible I am still wondering, Sir!

**మంత్రి :** ఇంతకూ ఆ చార్జెస్ ఏంటి?

సెక్ర : ఇదిగోండి చదవండి... (ఆఫిడవిట్ కాపీ ఒకటి అతని ముందువేసాడు – మంత్రి అది చదువుతుండగా...) ..... మనం చేసిన భూకబ్జాల దగ్గర నుండి మీ సెకెండ్ సెటప్ తమ్ముడికిప్పించిన ఉద్యోగం వరకూ ఉన్నాయి.

**మంత్రి :** ఆఖరికి ఇంట్లో ఉండే నగల మీద ఒక చార్జ్ పెట్టారు. విదేశాల్లో నేను బంగారం కొనుగోలు చేసానట. నా బంధువుల లందరికీ రూల్సు నుండి మినహాయింపు ఇచ్చానట.

సెక్ర : ఇస్తాం సార్. అది తప్పెలా అవుతుంది. మన బంధువులకు మినహాయింపు ఇవ్వకపోతే అపోజిషన్ పార్టీ వాళ్ళ బంధువులకిస్తారేంటి? అది నిలవదు లెండి.

మంత్రి : డబ్బులు తీసుకొని ప్రమోషన్స్, పోస్టింగ్స్ ఇచ్చానట... ఏవండీ అలా ఇచ్చామా?

సెక్ర : ఇస్తేమాత్రం అటు ఇచ్చినవాడు చెబ్తాడా? ఇటు పుచ్చుకున్నోడు చెబ్తాడా? ఇది అస్సలు నిలవదు.

మంత్రి : వేలం పాటల్లో కోట్లు కొట్టేశానా?

సెక్ర : అది పబ్లిక్ వేలం సార్. నోటీసిచ్చాం. టాం టాం వేసాం. ఇంటరెస్ట్ ఉన్నవాళ్ళు పాట పాడేరు. మరికొంత మందిని రౌడీలు పాటలో పాల్గోకుండా అటకాయించారే అనుకోండి, అయితే ఆ రౌడీలు మీ వాళ్ళేనని ఎలా ప్రూవ్ చేస్తారట. అదీ నిలవదు.

మంత్రి : బస్సులకు దొంగ నెంబర్లేసి ఎక్కువ ట్రిప్పులు నడిపి పన్ను ఎగ్గొడుతున్నానట.

సెక్ర : ఎవడు చూశారట. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంటు కళ్ళు మూసుకుందేంటి సార్. ఇలా అమ్మవారి దండకంలా చదువుకుంటూ కూర్చుంటే లాభం లేదు. మనకు కొంచెం breathing time దొరికాక Defamation suitt పడేద్దాం... ముందసలు ఇంత డీటైల్డ్‌గా వాళ్ళకి information ఎవరిచ్చారో అది తెల్సుకోవాలి.

మంత్రి : (చదవడం ఆపేసి) మనల్నెవరో క్లోజ్‌గా గమనించిన వాళ్ళే ఇచ్చి ఉంటారు. మీ పర్సనల్ స్టాఫ్ నమ్మకమైన వాళ్ళేనా?

సెక్ర : పూర్తిగా, ఎటొచ్చీ మీ వాళ్ళ మీదే నాకు డౌట్.

మంత్రి : నెవ్వర్. వాళ్ళెప్పుడూ అలాంటి పన్జెయ్యరు. మీవాళ్ళ దగ్గర నుండే లీకయ్యుంటుంది.

సెక్ర : కానేకాదు. ముమ్మాటికీ ఇది మీవాళ్ళపనే. పేషీనిండా పోరంబోకుల్ని పెట్టుకున్నారు.

మంత్రి : నీ చుట్టే పనికిమాలిన గ్యాంగంతా చేరింది.

గాయ : మాటలు పారేసుకొని ఆపద సమయంలో అందర్నీ దూరం చేసుకోకండి... ఎవరి వల్ల అయితేనేమి జరిగింది. జరక్కుండా చెయ్యలేం. ఇప్పుడేమి చెయ్యాలో కాస్తా సలహా చెప్పండి సెక్రటరీ గారు.

మంత్రి : ఎందుకూ?... అది కూడా అవతలి వాళ్ళకు చేరవేస్తావా?

గాయ : నేను చేరవెయ్యడమేమిటండీ.

మంత్రి : నాకు తెలుసు ఇదంతా మొత్తం లీక్ చేసింది నువ్వే.

గాయ : నేనా?

మంత్రి : ఎస్! నువ్వే! నాకు తెలుసు... ఆరోజు కూడా మీడియాకి చెప్తానని బెదిరించావు. సెక్రటరీ గారూ మీకు గుర్తుందా?

సెక్ర : యస్... యస్... కానీ....

గాయ : ఇదేం ఖర్మండీ! నేను చేసి ఉంటే ధైర్యంగా ఆ విషయాన్ని ఒప్పుకొనేదాన్ని, పైగా గర్వపడేదాన్ని కూడా.

మంత్రి : ఏంటి నా పరువు బజారుకీడ్చి, నన్ను అప్రతిష్ట పాలుజేసి నా పదవి ఊడగొట్టించి నీవు గర్వ పడేదానివా? ఎంతట ఆడదానివే నువ్వు.

సెక్ర : మీరుండండమ్మా పుండు మీద కారం చల్లకండి.

మంత్రి : పుండు మీద కారమే కాదండీ, అది మొగుడు శవం మీద నాట్యం చెయ్యగల్దు... సెక్రటరీ గారూ!...

సెక్ర : లేదా అంటే ఉంది... ఉందీ అంటే పూర్తిగా ఉన్నట్టూ కాదు... ఏదీ ఏమిటనేది ఇప్పుడే ఇతమిద్ధంగా చెప్పలేం.

గాయ : మీరు చెప్పలేకపోవచ్చు. కానీ టి.వి.లో ఏదో చెబుతున్నారు. వినండి.

సెక్ర : సార్ (టి.వీలోకి చూస్తూ) మంత్రి శివశంకరంగారి మీద వచ్చిన అభియోగాలను పరిశీలించిన పిదప వాటికి ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నట్టు కోర్టు భావిస్తోంది. ఈ ఆరోపణలన్నీ కూలంకషంగా విచారించేందుకు ఓ కమిషన్‌ని వెయ్యాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది.

మంత్రి : (మ్రాన్పడిపోయాడు)

సెక్ర : సార్!.....సార్!

మంత్రి : అంటే నన్నింక పదవిలోంచి తప్పిస్తారుగా.

సెక్ర : జనరల్‌గా అలాగే చేస్తారు.

మంత్రి : ఎంత నమ్మకద్రోహం!

సెక్ర : ఎంక్వయిరీ అయిపోయిన వెంటనే మళ్ళీ మనపదవి మనకు ఇచ్చేస్తారు. ఇవన్నీ పిల్లలు దొంగా-పోలీసాట ఆడుకుంటారు చూడండీ! అలాంటిదే.... అంత కన్నా పెద్ద సీరియస్‌నెస్ ఉండదు.

మంత్రి : నాకు మాత్రం అలా జరగదు. పదవి పెర్మనెంటుగానే పోతుంది. మళ్ళీ రాదు.

సెక్ర : అధైర్య పడకండి. తప్పకుండా వస్తుంది.

మంత్రి : రాదు.... రాదు.... రాదు.... బయట ఉండే శత్రువుల్ని గుర్తించగలం. కానీ ఇంట్లో వాళ్ళను ఎప్పటికీ గుర్తించలేం. అసలు వాళ్ళు శత్రువులనే విషయమే మనకు తట్టదు... ఇదిగిదిగో నా భార్య రూపంలో ఉన్న నా ఆగర్భశత్రువు. పాముని పెళ్ళామనుకొని ఇన్నాళ్ళూ కాపురం చేసాను. టైంచూసి కాటేసింది. సెక్రటరీ గారూ! వాళ్ళు పదవి పీకేసే ముందే నేనే రాజీనామా చేస్తాను.. ఏదీ పెన్నూ, పేపరు ఇవ్వండి.

సెక్ర : ఏంటి? ఎందుకు తొందరపడతారు.

మంత్రి : రిజైన్ చేస్తే మన మర్యాద మనం నిలపుకున్నట్టవుతుంది.

సెక్ర : మీరు నిజంగా అమాయకులు సార్! అవున్సార్!... రిజైన్ చేయడమంటే అంత సుళువా నాకర్థం కాదు. అరే! ప్రజలకు సేవ చెయ్యడానికి పథకాలు దొరకవు గానీ, పదవి కాపాడుకోవడానికి ఎన్ని మార్గాలు లేవు.

విష్ణు : ఏంటో చెప్పండయ్యా!

సెక్ర : ఒకటి మనం సంపాయించిన దాంట్లో కొంత పైవాళ్ళకు ముట్టజెప్పి కుర్చీలో కదలకుండా కూర్చోవడం. ఇప్పుడు కోర్టు వ్యవహారముంది గనుక ఇది వర్క్‌వుట్ కాకపోవచ్చు.

విష్ణు : రెండూ.....

సెక్ర : మీ కులస్థులందరి చేత మీకే పదవి ఉండాలనీ, ఉంచకపోతే ఊరుకోననీ గట్టిగా చెప్పించాలి. అందుకు అవసరమైతే కొంత అల్లరి సృష్టించాలి.

విష్ణు : మూడూ....

సెక్ర : ఒక వేళ దానికీ లొంగకపోతే మన కేసు కోటా క్రింద మంత్రి పదవి ఉండాలి గనుక, మీరు పనికిరారని కోర్టు అంటే, అమ్మగారిని ఆ కుర్చీలో కూర్చోబెట్టాలి.

విష్ణు : నాలుగూ....

సెక్ర : ఇక ఫైనల్‌గా నాలుగోది. చాలా పవర్‌ఫుల్. ఇంత వరకు దీన్ని ఉపయోగించిన వాళ్ళెవరూ ఫెయిల్ కాలేదు. సాక్షాత్తూ విష్ణుమూర్తి సుదర్శన చక్రంలాంటిది.

విష్ణు : ఏంటి అంత పవర్‌ఫుల్ ఆయుధమా?

సెక్ర : (మంత్రితో) చెప్పమంటారా?

మంత్రి : చెప్పు, పదవి నిలబెట్టుకోవడానికి ఏమైనా చెయ్యాలి. చెప్పు. నా కొడుకు అమెరికా నుండి వస్తే వాడిని నియోజక వర్గానికి గర్వంగా పరిచయం చేద్దామనుకున్నాను. కానీ ఇప్పుడు ఈ కోర్టు కేసులో నేనుండగా నన్నెవరు గౌరవిస్తారు. నా మాట ఎవరు వింటారు... నాకే లేనప్పుడు ఇకనా కొడుకు భవిష్యత్ ఏమిటి! ప్రజల ముందేకాదు, ఆఖరకు నా కొడుకు ముందు కూడా నేను తలదించుకొనే పరిస్థితి వస్తుంది. నో.. అలా జరగడానికి వీల్లేదు. సెక్రటరీగారూ... చెప్పండి... మీరేం చెప్పినా చేస్తాను. నా పదవి నిలబడాలి... నా పరువు నిలబడాలి. నా కొడుకుని నా రాజకీయ వారసునిగా నిలబెట్టాలి. చెప్పండి. ఏం చెయ్యమంటారో చెప్పండి.

సెక్ర : మీ రెండు జిల్లాల్ని విడదీసి ప్రక్క రాష్ట్రంలో కలపమని లేదా సపరేట్ రాష్ట్రంగా చెయ్యాలని ఉద్యమం తీయించండి..

మంత్రి : (ముఖంలో పైశాచిక ఆనందం కదలాడింది)
అబ్బా! ఎంత గొప్ప ఆలోచన.

సెక్ర : అయితే implementation చాలా ఇబ్బంది కరమైంది.

గాయ : మీకేమైనా మతిపోయిందా?

మంత్రి : మీరు చెప్పండి సెక్రటరీ గారు. ఇప్పుడు మనమెవరి మాట వినం. ఇలాంటి వాళ్ళ మాట అస్సలు వినం చెప్పండి.

సెక్ర : వెంటనే మనవాళ్ళందరి చేత రెండు జిల్లాల విమోచన సంస్థ ఏర్పాటు చెయ్యమనండి. మన డిమాండ్ ఉద్యమరూపం దాల్చి, ఓ నాలుగు చోట్ల అల్లర్లు జరిగితే పెద్దలకి అర్థమౌతుంది. మీ బోటి అనుభవజ్ఞుల్ని బయట ఉంచితే ఇంకా ప్రమాదమని. దాంతో మీ పదవి సేఫ్! మీరూ సేఫ్.

గాయ : మీరు బయటకు వెళ్ళండి!

సెక్ర : అమ్మా!

**గాయ** : న్యాయస్థానం తప్పుపట్టిన వెంటనే గద్దె దిగిపొమ్మని సలహా ఇవ్వకుండా రాష్ట్రాన్ని ముక్కలుగా చీల్చమని ప్రోత్సహిస్తారా!

సెక్ర : భలేవారమ్మా! చీలికే నిజమైతే ఈసరికి రాష్ట్రం ఎన్నిసార్లు చీలికలై పీలికలై ఉండేది. ఉత్తుత్తినే మన పదవి మనకు దక్కేదాకా అలాగంటాం.

**మంత్రి** : కాదు అవసరమైతే చీలుస్తాం. చేతికి దక్కిన పండుని వొల్చుకున్నప్పుడే దాని రుచి చూడగలం. వేటాడిన జంతువును కాల్చి ఖండ ఖండాలుగా కోసినప్పుడు దాన్ని తిని కడుపు నింపుకోగలం. అలాగే పదవులు మనకు దూరమైనప్పుడు, మనుష్యుల్ని కూడా ఒకరి నుంచి మరొకర్ని దూరం చెయ్యాలి. మనసుల్ని విరిచెయ్యాలి. ప్రాంతాల్ని విడగొట్టాలి. తప్పదు. ప్రతీ జిల్లా ఒక ఖిల్లా అని వాదించాలి. ప్రతి గల్లీ ఢిల్లీతో సమానమని చాటాలి.

**గాయ** : నే నూరుకోను. ఇన్నాళ్ళు ఎంతో అన్యాయాన్ని భరించాను మరెంతో దుర్మార్గాన్ని సహించాను.. ఇక సంహించలేను. మర్యాదగా చెప్తున్నాను. హైకోర్టు తప్పుపట్టింది గనుక మర్యాదగా, రాజీనామా చేసి అతనికివ్వండి..

**మంత్రి** : నేనివ్వను... పైగా బ్రహ్మాండమైన ఆలోచన అందించాడు మా సెక్రటరీ. దాన్ని అమలు చేస్తానుగానీ... నీ మాటెందుకింటాను.

**గాయ** : వినరా!

**మంత్రి** : వినను... (ఫోనులో) ఒరేయ్! అప్పలనర్సింహం! మన పార్టీ వాళ్ళను కార్యకర్తల్నీ అందర్నీ పోగేసి అర్జెంటుగా ఒక మీటింగ్ పెట్టండి. ముఖ్యంగా మాజీలందర్నీ పిలవండి. సీనియర్ల్నీ, జూనియర్ల్నీ అందర్నీ పిల్చి... అవసరమైతే రాస్తారోకోలు, ధర్నాలు చెయ్యమను... ఆ... ఆ!... ఏది తగలబడిపోయినా ఫర్వాలేదు. ఎందరు చచ్చినా ఫర్వాలేదు... నేను చెప్పినట్టు చెయ్యండి (అలా మాట్లాడుతూ లోనకు వెళ్ళాడు)

**గాయ** : సెక్రటరీ గారూ! నేను ఇన్నాళ్ళూ ఎన్నో మంచి మాటలు చెప్పాను. కానీ ఒక్కటి కూడా ఆచరించలేదు. కానీ రాష్ట్రాన్ని నాశనం చెయ్యమని మీరిలా చెప్పారో లేదో అప్పుడే అమలు చెయ్యడానికి అర్రులు చాస్తున్నారాయన.

సెక్ర : That is natural, Madam! ఎవరి ఉద్యోగాన్ని వాళ్ళు కాపాడుకోవాలిగదా! పైగా వారసత్వం ప్రోబ్లెమ్.

**గాయ** : కాదు. చెడు ఆకర్షించినంతగా మంచి ఆకట్టుకోలేదు. ఇవి చేతులు కావనుకోండి. ఈ రొంపిలో ఆయన్ని దింపకండి

**సెక్ర** : నేను దింపేదేముంది మేడమ్! నా పరిస్థితి delicate గా మార్చేస్తున్నారు. ఇదంతా ఓ గేమ్. పొలిటికల్ గేమ్. పవర్ గేమ్ ఆ గేమ్‌లో ఎవడు గెలుస్తారో వారిదే సింహాసనం.

**గాయ** : ఒద్దండీ! మనుష్యుల సమాధుల మీద ఏ సామ్రాజ్యాన్ని నిర్మించకూడదండీ..

**మంత్రి** : (ఫోనులో మాట్లాడ్డం పూర్తి చేసి) సెక్రటరీ గారూ! మీరు నేను కలిసి ఈ ఉద్యమాన్ని నడుపుదాం. ప్రత్యేక రాష్ట్రం వచ్చిందనుకో మీరే ఛీఫ్ సెక్రటరీ! ఓకేనా!

**సెక్ర** : ఓకే సార్! నేవెళ్ళొస్తా. (గాయత్రి చాలా Stubborn గా చూసింది.)

**గాయ** : అయితే నా మాట వినరు?

**మంత్రి** : ఎప్పుడు మాత్రం విన్నాను. ఇప్పుడు అసలు వినను.

**గాయ** : చూడండి! మీ కాళ్ళు పట్టుకొని బ్రతిమాలుతున్నాను. ఈ ఘోరకలిని ఆపండి. మీ ఉద్యమం హింసామార్గం పడితే ఎన్ని ప్రాణాలు పోతాయో ఊహించలేం. ప్రపంచమే ఒక గ్రామంగా మారబోతున్న ఈ రోజుల్లో మీ పదవులకోసం ప్రజల మధ్య విభేదాల్ని సృష్టించి, వైషమ్యాల్ని రగల్చడం భావ్యం కాదు.

**మంత్రి** : స్సరే నువ్వన్నట్టు ఈ పన్జెయ్యడం మానేస్తాను. నా పదవి నిలుపుకోవడానికి ఇంకే మార్గముందో చెప్పు.

**గాయ** : రాజీనామా చేసి, మళ్ళీ ఎన్నికల్లో నిలిచి గెలవండి మీ తరపున ఇంటింటికి నేను తిరుగుతాను.

**మంత్రి** : తిరిగి... నా మొగుడికి ఓటెయ్యొద్దని చెబ్తావు కదూ!

**గాయ** : నా మాటలిని రాజీనామా చెయ్యకపోతే ఆ పని ఇప్పుడే జేస్తాను.

**మంత్రి** : ఏం జేస్తావు.

**గాయ** : నేనూ ప్రజల్లోకి వెళ్తాను. మీ కుట్రంతా బయటపెట్టి, మీ ఆటలు సాగకుండా చేస్తాను. మీకున్న తెలివి, సాహసం నాకూ ఉన్నాయండీ.

**మంత్రి** : నన్ను బికారిని చెయ్యాలనా? అది నీ వల్ల కాదు.

**గాయ** : ఏవండీ నన్నులోనపెట్టి నిర్భందించగలరు. కదలకుండా నన్ను కట్టి పడేయనూ గలరు. కాని నిజాన్ని నిర్బందించగలరా! సత్యాన్ని

త్రొక్కిపెట్టగలరా! ఇన్నేళ్ళుగా ప్రతీక్షణం అవకాశం దొరికినప్పుడల్లా ఓ మంచి మాట చెప్పడానికి మీ మనసును మంచివైపు మరల్చడానికి ప్రయత్నించాను. కానీ ఎప్పటికప్పుడు మీ స్వార్థం నా నోరు నొక్కేస్తున్నా, మీ ఆవేశం నా చిన్ని గొంతుని నులిమేస్తున్నా, దారి తప్పిన కొడుకు ఆగడాల్ని ఓ తల్లి ఎలా భరిస్తుందో అలాగే భరిస్తూ వచ్చాను. ఎందుకో తెల్సా? ఎప్పటికైనా మీరు మారతారని. ఒక సగటు మనిషి మంచితనం వాడికే పరిమితం. కానీ మీ బోటి నాయకుడు మంచి వాడైతే ఆ మంచితనం లోకమంతా వెలుగులు పంచుతుంది. అందుకే ఇన్నాళ్ళు అన్నిటినీ భరించాను.

**మంత్రి** : మాట్లాడింది చాలు, పదవే.... భరించక ఏం చేస్తావే.

**గాయ** : ఏం చేస్తానా! పీకపిసికి చంపుతా (గొంతు పట్టుకుంది)

**మంత్రి** : దొంగముండా వదలవే! వదలవే... (గొంతు విడిపించుకొని) నిన్నూ... (రెండు లెంపకాయలు కొట్టాడు)

**గాయ** : దొంగ వెధవల్లారా! మీ కొడుకులు, మనవల మీద ఉన్న ప్రేమ ప్రజల మీదెందుకుండదురా. వాళ్ళు చేసిన పాపమేమిట్రా! మీకు ఓట్లేసి గెలిపించడమేనా? చావు.....చావు. (చేతికి దొరికిందల్లా అతనిపైకి విసిరింది.) (వాటి నుండి తప్పించుకొని, ఆమెను ఒడిసిపట్టుకుని లోనకు లాక్కుపోయాడు)

**మంత్రి** : దొంగముండా! ఇక నిన్ను ఉపేక్షిస్తే నన్ను నేను క్షమించుకోలేని రోజొకటి వస్తుంది. పద... నిన్ను ఇంట్లో పెట్టి తాళమేసేస్తే తప్పా నాకు మనశ్శాంతి ఉండదు. (ఆమెను లాక్కుపోతుండగా)

**గాయ** : నాయినా విష్ణు, లక్ష్మీ బాయి! ఆ శంకరాచార్యుల ఫోటో వెనుక బీరువా తాళం చెవులున్నాయి. బీరువాలో ఉన్నవన్నీ, డబ్బు, నగలూ అన్నీ తీసుకెళ్ళి పేదవాళ్ళకి పంచెయ్యండి.

**లక్ష్మి** : ఇప్పటికీ అతను నూరో తప్పు చెయ్యలేదు కదా!

**విష్ణు** : నేనలా అనగలనా?

**లక్ష్మి** : ఇంకా మీన మేషాలు లెక్కించకుండా అతని శిరస్సుని తక్షణం ఖండించండి.

**విష్ణు** : ఇంతకు ముందే చెప్పానుగా ఆమె సమక్షంలో అతన్ని ఏవీ చెయ్యలేమని.

**లక్ష్మి** : స్సరే ఇప్పుడతను బయటకు వస్తాడుగా.

విష్ణు : తప్పకుండా శిక్షిస్తాను. ఇప్పుడే వస్తానుండు.

లక్ష్మి : అరెరె.... ఎక్కడికెళ్తున్నారు. (మంత్రి లోనుండి వస్తూ తలుపుకి గొళ్ళెం పెట్టి తాళం వేసాడు)

మంత్రి : అరేయ్ విష్ణు!

లక్ష్మి : బయటకెళ్ళినట్టున్నాడు దొర.

మంత్రి : దొంగ వెధవలు ఒక్కరూ సమయానికి ఉండరు.

లక్ష్మి : ఏం కావాలయ్యా!

మంత్రి : అవును అడుగుదామని ఈ టెన్షన్‌లో పడి మర్చిపోతున్నాను. ఎవరికి ఫోను కలపమన్నా వెంటనే కలుపుతున్నాడు. ఈ నెంబర్లన్నీ వాడికెలా తెలుసు.

లక్ష్మి : అదీ.....అదీ....

మంత్రి : నిజం చెప్పు మీరెవరు? ఎక్కడ నుండి వచ్చారు... మిమ్మల్నెవరు పంపించారు.

లక్ష్మి : నీబాంచెన్ దొరా! నిజ్జంగా మేము పనోళ్ళమయ్యా! మాకేమీ తెలీదయ్యా!

మంత్రి : విష్ణు! ఒరేయ్ విష్ణు.

విష్ణు : (వస్తూ) శివశంకరం! ఒరేయ్ శివశంకరం! (కొన్ని వందల గొంతులు ఒకేసారి పిల్చాయి.)

మంత్రి : ఏరా ఎంత పొగర్రా నీకు... ఒక మంత్రిని పేరు పెట్టి పిలుస్తావా?

విష్ణు : మంత్రి పదవికి మంగళహారతి పాడే సమయం వచ్చింది.

మంత్రి : నా ఉద్యమం నా రాజకీయ జీవితానికి క్రొత్త ఊపిరి పోస్తుంది. కొన్నాళ్ళు గ్రహణం పట్టినా మళ్ళీ నేనే వెలుగులోకి వస్తాను.

విష్ణు : రాలేవు. ప్రజల్లో వస్తున్న చైతన్యాన్ని ఒక్కసారి విను. మీరెంత గొంతులు చించుకొని వేర్పాటువాదాన్ని, హింసావాదాన్ని వినిపిస్తున్న ప్రజల గుండె లోతుల్లో నినదిస్తున్న దేమిటో విను.

గొంతులు: ఒరేయ్ దుర్మార్గుడా! మేమంతా కలిసిమెలసి అన్నదమ్ముల్లా ఉంటే మమ్మల్ని విడదీయాలని చూస్తావా? (ఈ మాటలు కొన్ని వేల మంది అన్నట్లు వినిపించింది.)

మంత్రి : ఎవడ్రా మాట్లాడుతున్నది. ఒరేయ్ నువ్వేనా!

**విష్ణు :** నేను కాదు. నువు విడగొట్టాలనుకునే ప్రజలు.

**మంత్రి :** నువ్వే... నువ్వే ఏదో గారడీ చేస్తున్నావు. నిన్ను వదిలి పెట్టను. నిన్నూ... (అని చేయిత్తాడు – ఆ చేయి అలా బిగుసుకుపోయింది.) ఎవరునువ్వు? నిన్ను బ్రతకనివ్వను (కాలితో తన్నాడు – కాలు అలా ఉండిపోయింది.)

**గొంతులు :** నువు రాజీనామా చెయ్యాలి... నువ్వు గద్దె దిగాలి.

**మంత్రి :** నేనెవరి గొంతులు వింటున్నాను. ఎవరి స్వరాలు నన్ను చుట్టుముట్టి నానరాల్ని పిండేస్తున్నాయి.

**విష్ణు :** ఆ స్వరాలు అమాయక ప్రజలవి. నిన్ను చుట్టుముడుతున్నది వాళ్ళ నిట్టూర్పులు. “నీ పదవి కోసం మమ్మల్ని బలిపశువులుగా చేస్తావా” అని కోటి గొంతుక లొక్కసారి నిన్ను ప్రశ్నిస్తుంటే నీకు ఊపిరాడట్లేదు కదూ!

**మంత్రి :** నిజమే! అలాగే ఉంది. కానీ నాలోని పదవీ కాంక్ష వీటన్నిటినీ జయిస్తుంది.

**గొంతులు:** లేదు ఈసారి ఓడిపోవాలి.

**మంత్రి :** లేదు గెలుస్తాను.

**గొంతులు:** కాదు ఈసారి మేము గెలుస్తాం. మానవత్వం గెలుస్తుంది.

**మంత్రి :** ఎప్పుడూ రాజకీయమే గెలుస్తుంది. అదీ మా కుట్ర. కుట్రే నెగ్గుతుంది. అదే రాజకీయం.

**విష్ణు :** ఈ సారి రాజకీయాన్ని

**గొంతులు:** ఓడిస్తాం.

**విష్ణు :** అవినీతిని, అక్రమాన్ని

**గొంతులు :** ఓడిస్తాం... ఓడిస్తాం.

**విష్ణు :** వేర్పాటు వాదాన్ని, హింసా ప్రవృత్తిని

**గొంతులు:** ఓడిస్తాం... ఓడిస్తాం...

**విష్ణు :** అయితే ఇదిగో రాజకీయ అవినీతిపరుడు, కుట్రదారుడు వేర్పాటువాది, స్వార్థపరుడు ఇక్కడున్నాడు పట్టుకోండి. (ఒక్కదుటిన ప్రజలు ముందుకొచ్చారు... మంత్రి హూంకరిస్తుంటే, ప్రజలు అతన్ని మోసుకెళ్ళిపోతున్నారు.)

**విష్ణు :** అతన్నేమి చేస్తారు.

**గొంతులు:** ఈ ప్రజాద్రోహికి తగిన శిక్ష పడేటట్టు చేస్తాం.

**విష్ణు :** మంచిది ఇతన్ని చూసి ఏ రాజకీయ నాయకుడు వేర్పాటువాదాన్ని తన రాజకీయ ఎత్తుగడగా ఎంచుకోకూడదు... చూశావా లక్ష్మీ! ఆ దుర్మార్గుడికెలాంటి శిక్ష పడిందో.

**లక్ష్మి :** నేను సందేహించినట్టే జరిగింది. మీరసలు నా దైవమేనా! మీలో ఉన్నది నారాయణాంశయేనా?

**విష్ణు :** కాదని ఎవరన్నారు?

**లక్ష్మి :** వైకుంఠంలో ఉంటే ఏదో కారణంతో తప్పించుకుంటున్నారని ఇక్కడకు తీసుకు వచ్చాను. అతను తప్పు చేసినప్పుడల్లా సంజ్ఞ చేస్తూనే ఉన్నాను. ఉహూ కనీస స్పందన కూడా లేదు. చివరకు అతని రాక్షసత్వం విశ్వరూపం దాలిస్తే ఆఖరుకు అమాయక ప్రజల్లో చైతన్యం వచ్చింది. కానీ మీరు రవ్వంత... రవ్వంత కూడా చలించలేదు. ఇదేనా మీకున్న ధర్మపరిరక్షణా నిబద్ధత. ఇదేనా మీరు నెరవేర్చే దుష్ట శిక్షణా కర్తవ్యపాలన. ఈ మాటవింటే దేవతా స్త్రీలు నన్నెంత గేలిచేస్తారో.

**విష్ణు :** లక్ష్మీ! నీకెంత చెప్పినా అర్థంకాదా?

**లక్ష్మి :** అర్థం కానిది మీకా? నాకా?

ఆ దుర్మార్గుడు టి.వి. యం.డి. మీద ఎంతెంత దుర్భాషలాడి దాడి చేయబోతే ఎందుకు మిన్నకుండిపోయారు. భార్యను ఇంట్లో బంధిస్తుండగా ఎందుకు చలించలేదు. తన పదవి కాపాడుకోవడానికి, అల్లర్లు చెయ్యమని, సమ్మెలు చేయమని, ఆఖరుకు, బాంబులు పెట్టి చంపమని మనుష్యుల్ని పురమాయిస్తుంటే మీ కళ్ళు కానరాకుండా పోయాయా! మీ కాళ్ళు చేతులు చచ్చుబడిపోయాయా! మీ మెదడు స్తంభించిపోయిందా? మీ గుండె ఆగిపోయిందా? సత్పురుషుల పక్షపాతిగా పేరు గాంచిన మీరు ఓ బండలా, ఎందుకు మారిపోయారు. ఇంత దుర్మార్గాన్ని ఎలా సహించ గలిగారు. అలనాడు నిర్ధాక్షణ్యంగా రాక్షసుల్ని చీల్చి చెండాడి ప్రజల్ని కాపాడిన మీ ధర్మబద్ధత ఇప్పుడు ఏమైంది?

**విష్ణు :** లక్ష్మీ! అలనాడు పాలకుడు దైవ ప్రతినిధి. అతన్ని దైవాంశ సంభూతునిగా పరిగణించారు. అలాంటప్పుడు ఆ పాలకుడు ఓ రాక్షసునిగా ప్రవర్తిస్తే, ఓ దుర్మార్గునిగా మారితే, అతన్ని శిక్షించే బాధ్యత నేను తీసుకున్నాను. ఆ

క్రమంలోనే, ఓ హిరణ్యాక్షుడు, ఓ హిరణ్యకశిపుడు, ఓ రావణుడు, ఓ శిశుపాలుడు నాచేతిలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. కానీ ఇప్పుడు పాలకులే ప్రజాప్రతినిధులు. ప్రజల ఆమోదంతోనే వాళ్ళు రాజులవుతున్నారు. ప్రజలు ఎన్నుకుంటేనే వాళ్ళు నేతలవుతున్నారు. గద్దె నెక్కుతున్నారు. అలాంటి ప్రజా ప్రతినిధుల్ని నేనెందుకు సంహరించాలి. నాయకుల్ని సంహరించుకున్నా, సంస్కరించుకున్నా అది పూర్తిగా ప్రజల బాధ్యతే. ఏ దేవుడూ వారి మొర ఆలకించడు. వారికోసం అవతరించడు. ఇంకో విషయం. ఒక్క రాజులోనే కాదు ప్రతీ మనిషిలోను దైవాంశ ఉంది. నరుడు నారాయణుడు వేర్వేరు కాదు. ఆ ఇద్దరూ ఒక్కరే. జీవుడు, దేవుడూ ఒక్కరే. ఆత్మ పరమాత్మ ఒక్కటే. దుర్మార్గుల్ని శిక్షించడానికి నాదగ్గర ఐదు ఆయుధాలుంటే, ప్రజల దగ్గర వీటన్నిటిని మించిన ఆయుధం ఉంది. అది నా సుదర్శన చక్రం కన్నా శక్తి వంతమైంది.

**లక్ష్మి** : ఏమిటా ఆయుధం.

**విష్ణు** : ఓటు. ఓటు అనే ఆయుధాన్ని వినియోగించి వారు ఒక సామాన్యుడిని ప్రధానమంత్రిని చెయ్యవచ్చు. లేదా దేశాధినేతను పదవీ భ్రష్టుడ్ని చేసి వీధిలోకి విసిరెయ్యనూ వచ్చు.

**లక్ష్మి** : అంత శక్తిగలదా?

**విష్ణు** : కానీ దాన్ని వాళ్ళు నిర్వీర్యం చేస్తున్నారు. కులం పేరున, మతం పేరున దుర్వినియోగ పరుస్తున్నారు. వాళ్ళకు తగినట్టే, నాయకులు కూడా దొరికినంత దోచుకోవాలని చూస్తున్నారు.

మాకురు ధనజన యౌవనగర్వం
హరతి నిమేషాత్కాల స్సర్వమ్
మాయా మయ మిద మఖిలంహిత్వా
బ్రహ్మపం త్వం ప్రవిశ విదిత్వా.

క్షణవిత్తం క్షణ చిత్తం క్షణ కాలం ఈ జీవితం. మీరు ఆర్జించిన ప్రతీది, మీతో పాటు క్షణంలో హరించుకు పోతుంది. కాబట్టి ప్రజాసేవయే పరమావధిగా ఎవరు భావిస్తారో వారిని పాలకులుగా చేస్తే మీ జీవితాలు దుర్భరంకావు. మీలో ఉన్న నా అంశను గుర్తించి, ప్రజలకు భిన్నంగా పాలకులుండకూడదనే సత్యాన్ని గ్రహించి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను.

(Lights Off - Lights On)

**బంగా** : ఇదిగో! చాలా గొప్పనాటకాన్ని చూపించావు. నువ్వన్నట్టు భజగోవిందం అప్పటికీ ఎప్పటికీ ఆచరణీయమైందే!

**కేతి** : ఒక్క భజగోవిందమే కాదు – మన ప్రాచీన భారతీయ సాహిత్యంలోని ప్రతీ మాట ఒక ఆణిముత్యమే. ప్రతీ పదం పరమపద సోపానమే.

**బంగా** : అయ్యో ఏంటయ్యా ఇది.... నాకు బొమ్మ రూపం పోతోంది. ఇదేమిటి క్రమేపి మనిషినై పోతున్నాను.

**కేతి** : నా పరిస్థితి కూడా అలాగే ఉంది. నేను మనిషిలాగే నడవగలుగుతున్నాను... అర్థమైంది ఇది నాటక ప్రభావం.

**బంగా** : కాదు భజగోవిందం మహిమ.

**కేతి** : చూసారా ఇన్ని మంచి మాటలు విన్నందుకు, దైవం గురించి తెల్సుకున్నందుకు బొమ్మలమైన మేము మనుష్యులమైపోయాం. ఆధ్యాత్మిక భావ సంపదను అనుభవించి ఆచరించిన నాడు మనుష్యులైన మీరు మహాత్ములు కారా? మహానుభావులుగా మిగిలిపోరా? తప్పకుండా అవుతారు... శుభం భుయాత్. ఓం శాంతి! శాంతి! శాంతి!